
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 03.05.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 48 పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్
నెలలు తక్కువ బిడ్డా ? సంరక్షణ కొరకు...
పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)
Dr. T. Ravikumar's
రిచ్ హాస్పిటల్
రవి చిన్నపిల్లల హాస్పిటల్



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com



## కిరణయ్య ఎవరిమాటా వినడు!

అదృష్టవంతుడినెవరూ చెడగొట్టలేరు. దురదృష్టవంతుడినెవరూ మార్చలేరు. మొండివాడు మహాబలవంతుడు. రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇదే బాపతు మనిషి. అనుకునే వాళ్లు అనుకుంటూనే వున్నారు... చేసే వాళ్లు చేస్తూనే వున్నారు... చెప్పేవాళ్ళు చెబుతున్నారు. కాని కిరణ్‌కుమార్‌రెడ్డి మాత్రం తాను చేయాలనుకున్నది చేసుకుంటూ పోతున్నాడు. ఎవరి మాటా వినదు సీతయ్య అనే తరహాలో ఎవరి మాటా వినకుండా, ఎవరికి ఏదీ చెప్పకుండా తాననుకున్నది చేసుకుంటూ పోతున్నాడు.

రాష్ట్రం కరువు కోరల్లో వుంది. వర్షాభావ పరిస్థితులతో జలాశయాలు ఎండిపోయాయి. రైతాంగం పరిస్థితి దయనీయంగా వుంది. పారిశ్రామికంగా పురోగతి లేదు. నిత్యావసరవస్తువుల ధరల పెరుగుదలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుండి ప్రజలు సహకారాన్ని ఆశిస్తారు. కాని ఇక్కడ సీన్ రివర్స్ అయ్యింది. మూలిగేనక్క మీద తాటికాయలా, గోరుచుట్టు మీద రోకటిపోటులా ప్రజల నెత్తిన కిరణ్ సర్‌ఛార్జీలు, కరెంట్‌ఛార్జీల రూపంలో బండను కాకుండా పెద్ద కొండనే పెట్టాడు. కరెంట్‌ఛార్జీలను ఇంతగా పెంచాక ఏ ముఖ్యమంత్రయినా ప్రజల ముందుకు పోవడానికి భయపడతాడు. కాని కిరణ్ ఆ జంకుబొంకు లేకుండా 'అమ్మహస్తం' అంటూ రాష్ట్రమంతా తిరుగుతున్నాడు. ఎన్నికలు వస్తున్నాయి. గతంలో కరెంట్‌ఛార్జీలను పెంచినందుకే చంద్రబాబు అధికారాన్ని కోల్పోయి ఇప్పుడు అధికారం కోసం నానా అగచాట్లు పడుతున్నాడంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు నెత్తినోరు బాదుకుని చెప్పినా కిరణ్ వినలేదు. కరెంట్ ఛార్జీలను భారీగా పెంచేసాడు. కేబినెట్‌లో సగం మందికిపైగా మంత్రులు కిరణ్ మీద గుర్రుగా వున్నారు. కాబట్టే ఆయన కూడా మంత్రులకు ఏమీ చెప్పకుండానే నిర్ణయాలు తీసేసుకుంటున్నాడు. నిన్నటి 'అమ్మహస్తం' గాని, నేటి 'బంగారు తల్లి' గురించి గాని తమకు మాటమాత్రం కూడా చెప్పకుండానే సీఎం ఆయనపాటికి ఆయన అమలు చేసుకుంటున్నాడని పీసీసీ చీఫ్ బొత్స సత్యనారాయణతో పాటు అసమ్మతి మంత్రులంతా పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సీజన్‌లో పార్టీకి నాలుగు ఓట్లు తెచ్చే వై.యస్.

(మిగతా 5వ పేజీలో)



## సిబిఐ కాంగ్రెస్ ఐ

### సుప్రీం చీవాట్లతోనన్నా మారేనా?

సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్... దీనికి మరో అర్థం కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్. సిబిఐకి రెండోపేరు సరిగ్గా సరిపోతుంది. ఎందుకంటే కాంగ్రెస్‌పార్టీకి, ఆ పార్టీ నేతలకు సేవ చేసినంతగా సిబిఐ ఈ దేశానికి సేవచేయలేదు. కాబట్టి సిబిఐను కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ అనడమే కరెక్ట్.

కాంగ్రెస్‌కు మహిళ, విద్యార్థి, రైతు, కార్మిక, ఎస్సీ, ఎస్టీ, బి.సి సెల్ వంటి అనుబంధ సంఘాలున్నాయి. సిబిఐను కూడా అలాంటి విభాగాలలో ఒకటిగా చెప్పుకోవచ్చు. నాటి భోఫోర్స్ నుండి నిన్నటి బొగ్గు కుంభకోణం దాకా కాంగ్రెస్‌ను రక్షించడానికి సిబిఐ చేయని ప్రయత్నమంటూ లేదు. విలువలనే పణంగా పెట్టి ఆ సంస్థ కాంగ్రెస్ కోసం పనిచేస్తుంది. భోఫోర్స్ కేసులో ప్రధాననిందితుడైన ఖత్రోచి దేశం వదిలి పారిపోయేదాకా కళ్లు మూసుకున్నారు. ఆయనను ఇక ఈ దేశం రప్పించలేమని చెప్పి కేసు మూసేసారు.

ఇక గత కొన్నేళ్లుగా కేంద్రంలోని మైనార్టీ యూపిఏ ప్రభుత్వాన్ని కాపాడుతూ వస్తున్నది సిబిఐనే! కాంగ్రెస్ పల్లకీని మోసాడు కాబట్టే పశుదాణా కుంభకోణంలో నిందితుడుగా వున్న లాలూప్రసాద్‌యాదవ్‌ను ఆ కేసు నుండి గట్టెక్కించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్ యాదవ్, బిఎస్పీ అధినేత మాయావతిలకు సిబిఐని బూచిగా చూపే, వారి మద్దతుతో కేంద్రంలో ప్రభుత్వాన్ని నడుపుతున్నారు.

సిబిఐని కాంగ్రెస్ ఎంత వచ్చిగా వాడుకుంటుందనే దానికి ఆంధ్రాలో జగన్మోహన్‌రెడ్డి ఉదంతమే ఉదాహరణ. కాంగ్రెస్ అధిష్టానం ఒత్తిడితోనే సిబిఐ జగన్‌మీద ఛార్జిషీట్లు వేసుకుంటూ పోతోంది. కరుడుగట్టిన నేరస్తులకు సైతం రెండు, మూడు నెలల్లో బెయిలొస్తుంది. కాని జగన్ జైలుకెళ్లి ఏడాది కావస్తున్నా ఇంతవరకు బెయిల్ రాలేదంటే దానికి కారణం కాంగ్రెస్, సిబిఐ సంయుక్తంగా పన్నిన పన్నాగమే!

యూపిఏ-2లో వెలుగుచూసిన బొగ్గు కుంభకోణం విషయంలో సిబిఐ నిర్వాకం మరోసారి బయటపడింది. బొగ్గు గనుల కేటాయింపులపై విచారణ జరిపి ఆ నివేదికను తమకే అందజేయమని సిబిఐని సుప్రీం కోర్టు ఆదేశించింది. సిబిఐ దీనిమీద విచారణ జరిపింది. తర్వాత తన సహజబుద్ధిని పోనిచ్చుకోకుండా దీనిపై తయారు చేసిన నివేదికను కేంద్ర న్యాయశాఖ మంత్రి అశ్వినీకుమార్‌కు చూపింది. ఆయన ఈ నివేదిక ముసాయిదాను తమకు అనుకూలంగా మార్చుకున్నారు. ఈ విషయంపైనే సిబిఐని సుప్రీం తలవాచేలా మొట్టింది.

(మిగతా 5వ పేజీలో)

## కళాభిరాముడికి విశ్వవిఖ్యాత సాంస్కృతిక సార్వభౌమ బిరుదు



ఏప్రిల్ 21వ తేదీన విశాఖపట్నంలోని కళాభారతి ఆడిటోరియంలో వెలుపోలు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు, కళాబంధు టి.సుబ్బరామిరెడ్డిని 'విశ్వవిఖ్యాత సాంస్కృతిక సార్వభౌమ' బిరుదును సత్కరిస్తున్న మేఘాలయ చీఫ్ జస్టిస్ మీనాకుమారి, మంత్రి ఘంటా శ్రీనివాసరావు, పద్మభూషణ్ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం తదితరులు

## వీధినపడ్డ విభేదాలు

- జిల్లా పార్టీ కార్యాలయం మూత
- కొత్త కన్వీనర్ స్వాగతానికి 7గురు సమన్వయకర్తల డుమ్మా
- పార్టీలో తారాస్థాయికి వర్గపోరు

ఎంత కొత్త పార్టీ అయినా పేరులో కాంగ్రెస్ వుంది. నాయకులలో ఎక్కువశాతం మంది కాంగ్రెస్ నుండి వచ్చినవాళ్లే! కాబట్టి ఆ పాత వాసనలు, ఆ రోతబుద్ధులు ఎక్కడికి పోతాయి. ఊరు మారినంత మాత్రాన పందులు బురదగుంటల్లోకి పోకుండావుంటాయా? కొత్త పార్టీలో చేరినంతమాత్రాన పాత కాంగ్రెస్ నాయకులు తమ పెడబుద్ధులను పక్కన పెడతారా?

రాష్ట్రంలో జగన్‌గాలి బ్రహ్మాండంగా వుంది. వై.యస్. సానుభూతి పవనాలు బలంగా వీస్తున్నాయి. జగన్ హవా ధాటికి అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష తెలుగుదేశంలు కంగారెత్తుతున్నాయి. ఇంత అనుకూలంగా వాతావరణం వున్నప్పుడు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ లీడర్, కేడర్ ఎంత క్రమశిక్షణగా వుండాలి, ఎంత పటిష్టంగా పని చేయాలి. కాని నెల్లూరుజిల్లా పార్టీలో మాత్రం అది లోపించింది. ఇక్కడ పార్టీ కంటే కూడా నాయకులు తమ వ్యక్తిగత స్వార్థానికి, ఆధిపత్య పోకడలకు ప్రాధాన్యతనిస్తుండడం వల్ల అంతర్గత విభేదాలు వీధులకెక్కుతున్నాయి.

ఎంతకాలంగా జిల్లా వైకాపాలో మేకపాటి, కాకాణి వర్గాల మధ్య నలుగుతున్న వర్గపోరు ఈమధ్య బహిరంగమైపోయింది. జిల్లాలో వైకాపాను భ్రష్టుపట్టించడానికి నాయకులు తలా ఒక చెయ్యి వేస్తుండగా ఇందులో మేకపాటి సోదరులదే పైచేయి అయ్యింది. తాము చెప్పిన వారిని ఆయా నియోజకవర్గాలకు సమన్వయకర్తలుగా నియమించలేదనే కోపంతో మేకపాటి సోదరులు పార్టీ అధిష్టానం మీద అలిగి, ఒత్తిడి తెచ్చి జిల్లా పార్టీ కన్వీనర్ పదవి నుండి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని తప్పుకునేలా చేసారు. ఆ పదవిని తమ అనుచరుడైన మేరిగ మురళీధర్‌కు ఇప్పించారు. దీని తర్వాత కాకాణిని పార్టీ కేంద్ర కార్య నిర్వాహక కమిటీలోకి తీసుకోవడంతో దెబ్బకు దెబ్బ చెల్లుబోయినట్లయ్యింది.

కొత్త కన్వీనర్‌గా మేరిగ మురళీధర్ 1వ తేదీ నెల్లూరొచ్చారు. ఆయన విజయవాడ నుండి పినాకిని ఎక్స్‌ప్రెస్ ఎక్కి నెల్లూరు రైల్వేస్టేషన్‌లో దిగారు. మేకపాటి వర్గం తమ బలాన్ని చూపడానికన్నట్లు రైల్వేస్టేషన్ నుండి పొదలకూరురోడ్డులోని పార్టీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ ఏర్పాటు చేసింది. కాని ర్యాలీకి 7గురు సమన్వయకర్తలు హాజరు కాకపోవడంతో నేతల మధ్య నెలకొన్న విభేదాలు గుప్పుమన్నాయి. పాత కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డితో పాటు నగర కన్వీనర్ అనిల్ కుమార్‌యాదవ్, కావలి కన్వీనర్ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట కన్వీనర్‌లలో ఒకరైన నెలవల సుబ్రహ్మణ్యం.

(మిగతా 5వ పేజీలో)



మురళీధర్‌కు రైల్వేస్టేషన్‌లో ఘనస్వాగతం

PDF Compressor Free Version



# ఎన్నికలకు సన్నద్ధమవుతున్న కాంగ్రెస్







*రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పరిస్థితి ఎలా వుండబోతుంది? ఖచ్చితంగా దారుణంగానే వుండబోతుంది. ప్రజల్లో ప్రభుత్వం పట్ల తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మన జిల్లాలో అందుకు భిన్నంగా ఏమీ వుండబోదు.*

2009 ఎన్నికల వరకు కూడా జిల్లాలో కాంగ్రెస్ టిక్కెట్లు అంటే ప్రభాస్ కొత్తసినిమా టిక్కెట్లకున్నంత డిమాండ్ వుండేది. టిక్కెట్ల కోసం పైరవీలు, ఒత్తిళ్ళు, అధిష్టాన దేవతకు సాష్టాంగ ప్రమాణాలు, సూట్‌కేసుల మోతలు... ఇవన్నీ వుండేవి. రేపటి ఎన్నికలలో ఇవన్నీ కనపడవు. అభ్యర్థుల కోసం వెతుకులాట... కోట్లలో ఖర్చు పెట్టుకునే నేతల కోసం వెంపర్లాట... పోటీ చేయమని ఒత్తిళ్ళు... ఇవన్నీ కనిపించబోతున్నాయి.


నెల్లూరు లోక్‌సభకు 2009 ఎన్నికలలో కాంగ్రెస్ టిక్కెట్‌కు భలే గిరాకీ వుండింది. కాని మేకపాటి రాజమోహన్‌రెడ్డి సీటు కొట్టేసాడు. మధ్యలో ఆయన వైకాపాలో చేరాడు. ఇటీవల జరిగిన ఉపఎన్నికలలో కాంగ్రెస్ తరపున నెల్లూరు లోక్‌సభకు పోటీ చేయడానికి విశాఖపట్నం నుండి టి.సుబ్బరామిరెడ్డిని తీసుకురావాల్సి వచ్చింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలకు ఆయన నెల్లూరు రాడు. మరి ఇక్కడ అభ్యర్థి ఎవరు? ఇప్పటివరకు తేలలేదు. ఆ స్థాయి నాయకులు కూడా ప్రస్తుతం పార్టీలో కనిపించడం లేదు. నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పోటీ చేసే పరిస్థితుల్లో లేదు. మాగుంట కుటుంబీకులు ఒంగోలును వదలరు. ఆనం సోదరులు లోక్‌సభకు రారు. ఇక డీసీసీబీ ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి లాంటి సౌండ్‌పార్టీలను ఆరోజుకి రంగంలోకి దింపాల్సిందే! నెల్లూరురూరల్‌లో ఆనం కుటుంబమే వుంటుంది. నగరం చిరంజీవి కోటాలో మళ్ళీ ముంగమూరునే వరించవచ్చు. ఆత్మకూరును మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వదలడు. రాపూరులో నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, చెన్ను బాలకృష్ణారెడ్డిల మధ్య పోటీ వుంటుంది. పార్టీలోనే కొనసాగితే సర్వేపల్లి అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డే! గూడూరులో పనబాక కృష్ణయ్యే. సూళ్ళూరుపేట అభ్యర్థిని వాకాటి నారాయణరెడ్డి నిర్ణయిస్తాడు. కావలికి విష్ణువర్ధన్‌రెడ్డి, మాగుంట పార్వతమ్మలలో ఒకరుంటారు. ఉదయగిరికి కంభం విజయరామిరెడ్డి లేదా మాదాల జానకిరామ్... వీరిద్దరినీ కాదనుకుంటే ఎవరు డబ్బు వెద జల్లగలిగితే వారే ఇక్కడ అభ్యర్థి. కోవూరు నుండి పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మెన్ వై.సుమంత్‌రెడ్డిలు రంగంలో వుంటారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఏ నియోజకవర్గం నుండి ఎవరు అనే దిశగా మంత్రి ఆనం కసరత్తు చేస్తున్నారు. ఎన్నికలలో గెలిచినా, ఓడినా ముందుగా ఎన్నికల గుర్రాలను చూడాల్సిన బాధ్యత ఆయనదే! కాబట్టి ఆయన ఆ పనిలో పడ్డట్లు తెలుస్తుంది.

## నెల్లూరీయుడికి ప్రతిష్ఠాత్మక పదవి



నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం, మహిమలూరుకు చెందిన ప్రఖ్యాత సైంటిస్ట్ గుండ్ర సతీష్‌రెడ్డి హైదరాబాద్‌లోని రీసెర్చ్‌సెంటర్ ఇమారత్ (ఆర్‌సిఐ)కు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. గతంలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం లాంటి మహోన్నత వ్యక్తులు ఈ పదవిని నిర్వహించారు. దేశ రక్షణకు ప్రధానమైన క్షిపణుల రూపకల్పన జరిగే ఈ విభాగానికి సతీష్‌రెడ్డి డైరెక్టర్ కావడం పట్ల జిల్లా ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మహిమలూరులో సాధారణ రైతు కుటుంబంలో పుట్టిన సతీష్‌రెడ్డి గ్రామస్థాయి నుండే అంచెలంచెలుగా ఎదిగాడు. మహిమలూరులో టెన్త్‌వరకు చదివి నెల్లూరు విఆర్ కాలేజీలో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. 1980-84ల మధ్య అనంతపురం జేఎన్‌టియూ నుండి ఇంజనీరింగ్ పూర్తి చేసారు. 1986లో పూనేలోని డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగబాధ్యతలు చేపట్టారు. అక్కడనుండి ఒక్కో మెట్టు ఎదిగారు. నెల్లూరుజిల్లాకే గర్వకారణంగా నిలిచిన సతీష్‌రెడ్డికి 'లాయర్' అభినందనలు.



## కనులపండువగా...
# టీయస్సార్ జాతీయ సినీఅవార్డుల పండుగ

**స్టార్‌ల వెలుగులు... తారల తళుకులు... అన్ని రంగాల ప్రముఖుల మెరుపులు... చూస్తున్నవారి కంటికి విందుగా సాగింది ఆ కార్యక్రమం. ఏడాదికోసారి కాదు నెలకోసారి కాదు రోజుకోసారి ఇలాంటి వేడుక పెడితే ఎంత బాగుండు అనుకునేంతగా జరిగింది ఆ ఉత్సవం. ఇంతకీ ఏమిటా ఉత్సవం? ఎందుకు అంత ఆసక్తి?**

ఎందుకంటే అది కళాబంధు డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి నిర్వహించిన టీయస్ఆర్ జాతీయ సినీఅవార్డుల ప్రదానోత్సవం కాబట్టే ఆ వేడుకకు అంత ప్రాధాన్యత చేకూరింది. అలనాటి అతిలోక సుందరి శ్రీదేవితో పాటు ఆమెకు జంటగా జగదేక వీరుడు(చిరంజీవి), ఈనాటి గ్రీకువీరుడు (నాగార్జున), మొన్నటి మువ్వగోపాలుడు (బాలకృష్ణ)లను ఒకే వేదికమీదకు చేర్చిన ఘనత టీయస్ఆర్‌దే! ఇంతేనా...

వేదికపై బాలీవుడ్ మెరుపులూ మెరిసాయి... మురిపించాయి. అనిల్‌కపూర్, శతృఘ్నసిన్హా, రాణీముఖర్జీ, అమీషాపటేల్, ముఖేష్‌రిషి, దియామిర్జా, టాలీవుడ్ నుండి అక్కినేని నాగేశ్వరరావు, డి.రామానాయుడు, బ్రహ్మానందం, రామ్‌చరణ్, పూరీ జగన్నాథ్, శ్రీను వైట్ల, మంచు విష్ణు, మంచు లక్ష్మీప్రసన్న, తనికెళ్ల భరణి, దేవిశ్రీప్రసాద్, జయసుధ, తమన్, స్నేహ, మోహన్‌బాబు, అర్జున్, దిల్ రాజు, ఛార్మీ... ఇలా ఎందరో దిగ్గజాలు టీయస్ఆర్ అవార్డులను అందుకున్నారు.

ఏప్రిల్ 20వ తేదీన హైదరాబాద్‌లోని శిల్పకళావేదికలో టీయస్సార్ కళాపీఠం-టీవీ9 సంయుక్త ఆధ్వర్యంలో టీయస్ఆర్ జాతీయ సినీఅవార్డుల ప్రదానోత్సవం కన్నులపండువగా జరిగింది. శ్రీరామరాజ్యంలో నటనకు గాను హీరో



జ్యోతిప్రజ్వలనతో టీయస్సార్ జాతీయ సినీఅవార్డుల వేడుకను ప్రారంభిస్తున్న డి.రామానాయుడు, నాగార్జున, చిరంజీవి, బాలకృష్ణ, టి.సుబ్బరామిరెడ్డి, బోనీకపూర్, శ్రీదేవి, అర్జున్, రాజేంద్రప్రసాద్, అక్కినేని నాగేశ్వరరావు

బాలకృష్ణ టీయస్సార్ జాతీయ సినీ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే 'శిరిడిసాయి'లో సాయిబాబాగా అద్భుతంగా నటించినందుకుగాను నాగార్జున ఉత్తమనటుడు అవార్డునందుకున్నారు. కృష్ణంరాజు, సత్యనారాయణలు జీనత్ అమన్, టీయస్సార్ జీవిత సాఫల్య పురస్కారాలను, మిలినీయం ఉత్తమ నటుడిగా మోహన్‌బాబు పురస్కారాలు స్వీకరించారు. యూనివర్సల్ పెర్ఫార్మెన్స్‌యాక్టర్‌గా నటకిరీటి రాజేంద్రప్రసాద్ అవార్డునందుకున్నారు. సంభాషణల రచయితగా ఖదీర్‌బాబు స్పెషల్ జ్యూరీ అవార్డునందుకున్నారు.

ఈ వేడుకలో చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, అనిల్‌కపూర్, మోహన్‌బాబు, రాజేంద్రప్రసాద్ తదితరులు మాట్లాడారు. వారంతా కూడా కళారంగానికి టి.సుబ్బరామిరెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. 'కళాబంధు' అనే పదానికి అసలైన అర్థం ఆయనేనన్నారు. తెలుగు సినిమాకీర్తిని జాతీయస్థాయిలో చాటిచెప్పాలన్నదే తన లక్ష్యమని టీయస్సార్ ఉద్ఘాటించారు.

సుబ్బరామిరెడ్డి ఏదన్నా వేడుక జరిపారంటే రాజకీయ సినీ, కళా, పారిశ్రామిక రంగాల ప్రముఖులంతా అక్కడ కొలువు తీరుతారు. ఈ వేడుకలోనూ అన్నిరంగాల ప్రముఖులు హాజరై టీయస్ఆర్ పట్ల తమకున్న గౌరవాన్ని, అభిమానాన్ని చాటుకున్నారు.



టీయస్సార్ జాతీయ సినీ అవార్డులను స్వీకరిస్తున్న శ్రీదేవి, నాగార్జున, రాణీముఖర్జీ



టీయస్సార్ జాతీయ సినీ అవార్డులను స్వీకరిస్తున్న మంచు విష్ణువర్ధన్, దేవిశ్రీప్రసాద్, దిల్ రాజు

PDF Compressor Free Version





వైయస్సార్ కాంగ్రెస్‌లో జగన్మోహన్‌రెడ్డి తర్వాత మేకపాటి రాజమోహన్‌రెడ్డే పెద్దనాయకుడు. పార్టీలో ఆయన మాటకు తిరుగులేదు. జగన్ కూడా ఆయన చెప్పినట్లు వింటాడు. ఏ ఎన్నికలొచ్చినా ఆయన చెప్పిన వారికే సీట్లొస్తాయి... ఈ ఉద్దేశ్యంతోనే, ఈ నమ్మకంతోనే నెల్లూరుజిల్లాలో చాలామంది నాయకులు, కార్యకర్తలు వైయస్సార్ కాంగ్రెస్‌లో మేకపాటి సోదరుల సమక్షంలో చేరారు. నెల్లూరులో వైకాపా జిల్లా కార్యాలయం వున్నా కూడా కొంతమంది పనిగట్టుకుని మేకపాటి సొంత అతిథిగృహం వరకు ఊరేగింపుగా వెళ్లి పార్టీలో చేరారు. ఇదంతా కూడా వాళ్ల మెప్పు పొందడానికి, వారి ద్వారా పార్టీలో లబ్ధిపొందడానికి జరిగిన ప్రయత్నమే!

# ఇరకాటంలో అనుచరులు

## మేకపాటిని నమ్ముకుంటే అంతే సంగతులా!

కాని కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్ ఒకటి కాదని, ఇక్కడ పైరవీలకు స్థానం లేదని తన చేతల ద్వారా జగన్మోహన్‌రెడ్డి నిరూపించడంతో మేకపాటి సోదరులను నమ్ముకుని వైకాపాలో చేరిన వారికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్లయ్యింది. భవిష్యత్‌లో కూడా మేకపాటి సోదరుల ద్వారా ఏ పనీ కాదనే విషయం వారికి అర్థమైపోయింది.


కాంగ్రెస్‌లో మాదిరిగానే వైకాపాలోనూ పైరవీలు జరుగుతాయని, మేకపాటి సోదరుల ద్వారా సీట్లు పొందవచ్చునని కొంతమంది నాయకులు తీవ్రంగా ప్రయత్నించారు. నెల్లూరురూరల్ నుండి ఆనం వెంకటరమణారెడ్డి, నగరం నుండి అబ్దుల్ అజీజ్, కావలి నుండి మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి, వెంకటగిరి నుండి పాపకన్ను రాజశేఖర్‌రెడ్డిలు మేకపాటి ద్వారా ఆయా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జీలయ్యేందుకు ఆరాటపడ్డారు. తీరా అక్కడ ఎవరైతే ముందు నుండి పనిచేస్తున్నారో, ఎవరైతే జగన్ మనసులో వున్నారో వారినే ఆయా నియోజక వర్గాలకు కన్వీనర్‌లుగా ప్రకటించడంతో మేకపాటి అనుచరుల ఆశలు అడియాశలయ్యాయి. అంతేకాదు ఒక్క ఆత్మకూరు మున్సిపాల్టీ తప్పితే నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు గూడూరు, కావలి, సూళ్ళూరుపేట, వెంకటగిరి మున్సిపాల్టీలు మేకపాటి వ్యతిరేక వర్గం చేతిలో వున్నాయి. వీటిలో కార్పొరేటర్, కౌన్సిలర్ల టిక్కెట్లను ఆశిస్తూ చాలామంది మేకపాటి సోదరుల సమక్షంలో వైకాపాలో చేరివున్నారు. రేపు మున్సిపల్ ఎన్నికలు వస్తే టిక్కెట్ల కేటాయింపు నియోజకవర్గాల కన్వీనర్ల చేతుల్లోనే వుంటుంది. ఈ టిక్కెట్ల కోసం మేకపాటి అనుచరులుగా ముద్ర వేయించుకున్న వాళ్లు ఇప్పుడు డైలమాలో వున్నారు. రేపటిని దృష్టిలో పెట్టుకుని ఇక ముందు వాళ్ళు ఎలాంటి రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారో చూడాలి!

# 4న అన్నమయ్య స్వరార్చన



- ప్రతి సంవత్సరం మే నెల మొదటి శనివారం అన్నమాచార్య జయంత్యుత్సవాలు

ప్రతి సంవత్సరం మే నెల మొదటి శనివారం శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవాలని నిర్వహిస్తున్నట్లు అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటి ముఖ్యసమన్వయకర్త తుంగా శివప్రభాత్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నెల్లూరులో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్యుల వారి 605వ జయంతి సందర్భంగా ఈనెల 4వతేదీ శనివారం సాయంత్రం 6గంటలకు మినీబైపాస్ రోడ్డు అన్నమయ్య విగ్రహ ప్రాంగణంలో అన్నమయ్య స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీమాన్ తాళ్ళపాక అన్నమాచార్య జయంత్యుత్సవ కమిటీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. గౌరవాధ్యక్షులుగా రత్నం విద్యాసంస్థల ఛైర్మన్ కె.వి. రత్నం, అధ్యక్షులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఉపాధ్యక్షులుగా మురళీకృష్ణ గ్రూఫ్ ఆఫ్ హోటల్స్ యం.డి. వీరిశెట్టి హజరత్‌బాబు, ముఖ్యసమన్వయకర్తగా "లాయర్" వారపత్రిక సంగ్రాహకులు తుంగాశివప్రభాత్‌రెడ్డి కార్యవర్గ సభ్యులుగా 16 మంది నియమితులైనట్లు తెలిపారు. నెల్లూరురూరల్ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి చొరవతో, సహకారంతో అన్నమయ్య విగ్రహాన్ని ప్రతిష్టించినట్లు తెలిపారు. డా॥బెగోరె అవార్డు కమిటి కార్యదర్శి సహస్ర సభాసింహం బివి నరసింహం మాట్లాడుతూ అన్నమయ్య 605వ జయంతి సందర్భంగా నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో మొట్టమొదటి సారిగా సింహపురి కళాకారులచే అన్నమయ్య కీర్తనలను సుప్రసిద్ధ శాస్త్రీయ సంగీత కళాకారులు ఆలపిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో వీరిశెట్టి హజరత్‌బాబు, సన్నపురెడ్డి వేణుగోపాలరెడ్డి నలుబోలు బలరామయ్య నాయుడు, కళాంజలి ఆనంత్, కనుమూరు శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.



దివంగత నేత డాక్టర్ వై.యస్.రాజశేఖరరెడ్డి కుటుంబంపై మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేసిన నాటు, ఘాటు వ్యాఖ్యలను ఖండించడం ద్వారా ఆయన తమ్ముడు ఆనం జయకుమార్‌రెడ్డి ఒక్కసారిగా తెరకెక్కడం జరిగింది. జయ ఖండనతోనే ఆనం సోదరుల మధ్య సైతం విభేదాలున్నాయనే సంగతి రాష్ట్రవ్యాప్తంగా తెలిసిపోయింది.

# జయ పయనం ఎటు

## అన్నలతో కలుస్తాడా? వైకాపాలో చేరుతాడా?

ఇంతకాలం ఆనం వర్గం బలం ఆ నలుగురి అన్నదమ్ముల ఐక్యతే! ఈరోజు అన్నదమ్ముల మధ్య వచ్చిన విభేదాలే రేపు వారి రాజకీయ బలహీనతకు కారణం కాబోతున్నాయా అనేది వేచిచూడాల్సి వుంది. ఆనం జయకుమార్‌రెడ్డి రాజకీయంగా ఏ వైపు అడుగువేస్తాడనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ఆనం జయకు మంత్రి రామనారాయణరెడ్డితో విభేదాలు లేవు. వివేకాతో పడకపోవడం వల్లే ఆయన దూరమయ్యాడు. అన్నదమ్ముల మధ్య కొందరు రాజీకి ప్రయత్నిస్తున్నా అది ఫలించలేదు. మంత్రి వ్యాఖ్యలను బహిరంగంగానే ఖండించడం ద్వారా తాను ఇక వారితో కలిసి రాజకీయ పయనం సాగించలేననే విషయం జయకుమార్‌రెడ్డి చెప్పకనే చెప్పాడు.

వైయస్సార్ కాంగ్రెస్‌లో చేరాలనేది జయకుమార్‌రెడ్డి ఆలోచన. మరి వైకాపాలో ఆయనకు తగిన స్థానం వుందా? తగిన ప్రాధాన్యతనిస్తారా? అనేది చూడాలి. నెల్లూరునగరంతో పాటు రూరల్ నియోజకవర్గంలోనూ ఆయనకు అనుచరగణం వుంది. ఇప్పుడు ఈ రెండు నియోజక వర్గాలకు సమన్వయకర్తలను నియమించడం జరిగింది. అలాగే జిల్లా పార్టీ కన్వీనర్ వంటి జిల్లా స్థాయి పదవిని మేరిగ మురళికిచ్చారు. కాబట్టి నెల్లూరు కార్పొరేషన్ మేయర్, ఎమ్మెల్సీ లేదా రాష్ట్రస్థాయి ప్రభుత్వ నామినేటెడ్ పదవులను దృష్టిలో పెట్టుకుని ఆయన పార్టీలో చేరాలి. పదవుల విషయంలో జగన్ ఎవరికీ హామీలివ్వడంలేదు. ఎటువంటి హామీ లేకుండా జయకుమార్‌రెడ్డి పార్టీలో చేరి, తన భవిష్యత్‌ను గాల్లో పెట్టలేడు. ఎన్నో ఎన్నికలలో పనిచేసిన జయ లాంటి నాయకుడి అనుభవం పార్టీకి అవసరం. అలాగే కాంగ్రెస్‌లో వుండలేననుకున్నప్పుడు జయకు వైకాపానే మంచిమార్గం. పార్టీకి జయకు మధ్య సమన్వయం కుదిరి ఆయన పార్టీలో చేరితే నగరం, రూరల్ నియోజకవర్గాలలో అదనంగా కొంత బలం తోడవుతుంది.

# జీవచ్ఛవంలా 'పులి'



- 30ఏళ్ళుగా మంచానికే పరిమితం
- నరాల జబ్బుతో కదలలేని స్థితి
- ఎన్ని ఆసుపత్రులు తిరిగినా మెరుగుపడని పరిస్థితి
- దయామయులు కరుణించి ఆదుకోవాలంటున్న తల్లిదండ్రులు

*అతని పేరు పులి సుమన్.... పులిలా తిరగాల్సిన వయస్సులో మంచం నుంచి కదలలేని పరిస్థితి..తలలో ముఖ్యమైన నరాలు చచ్చుపడిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని డాక్టర్లు చెబుతున్నారు. ఎన్ని రకాల చికిత్సలు, పరీక్షలు చేయించినా ఫలితంలేదంటూ తేల్చి చెప్పారు. అయినా మమకారంతో, కడుపు తీపితో తల్లిదండ్రులు కంటికిరెప్పలా కాపాడుకుంటున్నారు. ముప్పై ఏళ్ళ వయస్సు వచ్చినా సపర్యలు చేస్తూ చంటి బిడ్డలా కాపాడుకుంటున్నారు. అయితే కూలీపనితో జీవనం సాగించే ఆ కుటుంబానికి సుమన్‌కు అయ్యే వైద్యఖర్చులు కష్టతరమవుతున్నాయి. ఎవరైనా దయామయులు కరుణించి ఆర్థికంగా ఆదుకోవాలని ఆ కుటుంబం వేడుకుంటోంది.*

నెల్లూరు జిల్లా ఇందుకూరుపేట మండలం, కుడితిపాళెం గ్రామానికి చెందిన పులినాయుడయ్య, సుబ్బమ్మ దంపతులకు ఇద్దరు సంతానం, కుమార్తెకు వివాహం చేశారు. ఒక్కగానొక్క కుమారుడైన సుమన్‌కు పుట్టుకతోనే కాళ్ళు, చేతులు కదలక చచ్చుబడిపోయాయి. ఎంతో మంది డాక్టర్లను సుమన్ తల్లిదండ్రులు కలిశారు. డాక్టర్లు పరీక్షలు చేసి నరాలు పనిచేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఉందంటూ తేల్చారు. సుమన్‌కు 15ఏళ్ళు వచ్చే వరకు తిరగని ఆసుపత్రిలేదు. ఉన్న కొద్దిపాటి పొలాన్ని అమ్ముకుని ఆసుపత్రుల్లో డాక్టర్లకు, పరీక్షలకు ఖర్చుచేశారు. కేవలం రెండు గేదెలతో పాలమ్ముకొని కుటుంబాన్ని గడుపుకొస్తున్నారు. తల్లిదండ్రులిద్దరూ పనికి వెళ్తే కుమారుడిని చూసుకునే వారు లేరు. కదలలేని కుమారుడికి స్నానం చేయించడంతో పాటు, అన్నం తినిపించడం, మంచం మీద పడుకోబెట్టడం వంటివన్నీ తల్లిదండ్రుల రోజు వారి దినచర్య. సుమన్ తల్లిదండ్రులకు కూలీపనులకు వెళితేగాని పూటగడవని పరిస్థితి. కూలీలకుపోతే సుమన్‌ను చూసుకునే వారులేరు. చీమకుట్టినా సుమన్ చూస్తూ ఉండాల్సిందేగాని కనీసం చేయికూడా కదల్చలేడు. ఇలాంటి పరిస్థితి ఎవ్వరికి రాకూడదని సుమన్ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం నుంచి నెలకు 500రూపాయలు మాత్రం పింఛన్ వస్తుంది. అవి మందులకు కూడా సరిపోవు. నెలకు రెండువేల రూపాయలు మందులు కొరకు సుమన్ తల్లిదండ్రులు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వం నుండి అంత్యోదయ కార్డు కూడా లేదు. అధికారులను కలిసినా ఇస్తామని చెబుతున్నారు కాని ఇప్పటికీ రాలేదు. పులి సుమన్ ఆవేదనతో మాట్లాడుతూ తల్లిదండ్రుకు వారి వృద్ధాప్యంలో సేవ చేయాల్సిన నేను 30ఏళ్ళుగా కదలలేని స్థితిలో తల్లిదండ్రుల చేత సేవచేయించుకుంటున్నానని, తన శరీరం మీద ఏది కుట్టినా, ఈగలు వాలినా చెప్పగలనేగాని అంగుళం కూడా కదపలేని పరిస్థితి, నాలాంటి ఈ దుస్థితి పగవాడికి కూడా రాకూడదని సుమన్ కన్నీళ్ళ పర్యంతమవుతున్నాడు.

దయామయులు కరుణించి సుమన్‌ను ఆదుకోవాలని సుమన్ తల్లిదండ్రులు నాయుడయ్య, సుబ్బమ్మలు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నారు.

దయార్ద్ర హృదయులు ఆర్థికంగా చేయూతనిచ్చి సుమన్‌ను మానవతా దృక్పథంతో ఆదుకుంటారని ఆశిద్దాం. సుమన్ పులిలా లేచి నిలబడి తన తల్లి దండ్రులకు ఆసరాగా ఉండాలని దేముని ప్రార్థిద్దాం.


# జిల్లాలో 31స్కూళ్లకు మంగళం

## సర్కార్ చదువులు ఇక ఎండమావులే!

రాబోయే విద్యాసంవత్సరంలో జిల్లాలోని 31స్కూళ్ళకు మంగళం పాడను న్నారు. విద్యార్థుల సంఖ్య తగ్గిందనేసాకుతో వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభంలోనే స్కూళ్ళను మూసివేసే పరిస్థితి దాపురించింది. ఈ 31స్కూళ్ళలో 16 ప్రాథమిక, 15ప్రాథమికోన్నత పాఠశాలలున్నాయి. మరో 131పాఠశాలలను మూసివేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. విద్యార్థుల సంఖ్య 10లోపు ఉన్న పాఠశాలలను మూసేయాలని విద్యాశాఖా నిర్ణయం తీసుకుంది. జిల్లాలో 2559 ప్రాథమిక పాఠశాలలు, 472 ప్రాథమికోన్నత పాఠశాలలు 338ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. అసలు విద్యార్థులే లేని 31 పాఠశాలలను గుర్తించారు. 109ప్రాథమిక పాఠశాలలు, 7ప్రాథమికోన్నత పాఠశాలల్లో 10 మంది విద్యార్థులే ఉన్నట్లు సమాచారం. 6,7తరగతుల్లోను 68 చోట్ల విద్యార్థుల సంఖ్య 10 మందిలోపే ఉన్నట్లు తెలిసింది. పాఠశాలల మూసివేతతో విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తున్నది. ఈ పాఠశాలల్లోని విద్యార్థులు సమీపంలో ఉన్న స్కూళ్ళలో చేరాల్సి వుంది. ప్రభుత్వ నిర్ణయంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీనికంతటికి కారణం ఉపాధ్యాయుల్లో అంకితభావం లోపించడం, అధికారుల పర్యవేక్షణ గాడితప్పిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల జోరుతో సర్కార్ చదువులు దాదాపు మూతపడే దశకు వచ్చాయి.

PDF Compressor Free Version






## బాబు డబుల్‌యాక్షన్

పంచపాండవులంటే నాకు తెలియదా? మంచంకోళ్ళులా ముగ్గురే కదా... అన్నాడట ఒక అమాయకుడు. ప్రజాసమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ప్రజాస్వామ్యమంటే అర్థం కూడా వారికి తెలియదు. ఇది చంద్రబాబు తనయుడు లోకం(రాజకీయం) తెలియని లోకేష్ స్టేట్‌మెంట్! ప్రజాస్వామ్యం అంటే అర్థం తెలిసిన టీడీపీ అధినేత చంద్రబాబు ప్రజాసమస్యల కొరకు పోరాడకుండా ప్రభుత్వంతో కుమ్మక్కెందుకయ్యాడు? కుమ్మక్కయి కూడా దీక్షలేంటి? ఎందుకీ డబుల్ యాక్షన్?

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## ప్రోటోకాల్ వివాదం

శిలాఫలకాలలో పేర్లు లేకపోవడం రాజకీయ ప్రజాప్రతినిధులకు మనస్తాపం కలిగిస్తుంది. భోజుడు, అశోకుడు, శ్రీకృష్ణదేవరాయలు ఈ దేశాన్ని ఎంతో చక్కగా ఏలారు. వాళ్లు శిలాఫలకాలలో పేర్ల కోసం వెంపర్లాడలేదు. ఇప్పుడున్న ప్రజాప్రతినిధులలో ఎక్కువ శాతం మంది అవినీతిపరులు, అత్యాశపరులే! ఇలాంటి వారి పేర్లు కూడా శిలాఫలకాలలో వేస్తే వాటికి అర్థం వుండదు. శిలాఫలకాలపై పేర్లను రాష్ట్రపతి, ప్రధాని, గవర్నర్, ముఖ్యమంత్రుల వరకే పరిమితం చేయాలి.

వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## ఉరి తీయాల్సింది జగన్‌ను కాదు

వైయస్.రాజశేఖరరెడ్డి రాజకీయ బిక్షతో ఎం.ఎల్.ఏ టిక్కెట్లు పొంది గెలిచి, ఆయన దయతో మంత్రులైన వ్యక్తులు నేడు విశ్వాస ఘాతకులుగా మారి వై.యస్.కుటుంబాన్ని తూలనాడడం వారి రాజకీయ పతనానికి నాంది. వై.యస్ సి.యంగా ఉన్న కాలంలో జగన్ ఏ అధికారికి ఫోను చేసి పనులు చేసి పెట్టమని కోరినట్లు ఎటువంటి ఆధారాలు లేవు. అటువంటి వ్యక్తిని రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐని పావుగా వాడుకొని అక్రమ కేసులతో జైలులో వుంచింది. జగన్ నిర్దోషిగా బయటకు రావడం ఖాయం. ప్రజాకోర్టులో కాంగ్రెస్ మంత్రులకు ఉరి తప్పదు.

టి.ఆర్.శాలి, కావలి.

## 'ప్రభా'తం

రాజకీయమనే మడుగులో దిగాక బురద అంటుకోకుండా ఎవరూ బయటకు రారేమో! రాజకీయ లక్షణమే అది. 2004లో ప్రధానిగా బాధ్యతలు చేపట్టేనాటికి మన్మోహన్‌సింగ్ ప్రతిష్ట ఎవరెస్ట్‌ను మించి వుండేది. అరోజు ఆయనకు అంతటి మంచి పేరుండింది. ఈ దేశంలో ప్రజలకు ప్రధాని స్థాయి నాయకులు అంటే నెహ్రూ, ఇందిర, రాజీవ్‌లు మాత్రమే. ఆ తర్వాత ఆ కుటుంబానికి అతీతంగా అంతటి ఇమేజ్ తెచ్చుకున్న నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి. కాని కాంగ్రెస్‌లో ఇందిర కుటుంబసభ్యుల తర్వాత పి.వి.నరసింహరావుతో సరిసమానంగా ప్రధాని స్థాయి ఇమేజ్ సంపాదించుకుంది మన్మోహన్‌సింగే! పి.వి.నరసింహారావు హయాంలో ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ పనితీరు ప్రజలలో బాగా నాటుకుపోయింది. ఆయన చేపట్టిన ఆర్థిక సంస్కరణలు ఫలితాలనిచ్చాయి. ముఖ్యంగా నీతి, నిజాయితీలు కలిగిన నాయకుడిగా ఆయన ప్రజల మన్ననలందుకున్నారు. కాబట్టే 2004లో సోనియాగాంధీ ప్రధాని పదవిని చేపట్టడానికి నిరాకరించి, మన్మోహన్ సింగ్‌ను ప్రధానిగా ప్రతిపాదించినప్పుడు అందరూ హర్షం వెలిబుచ్చారు. ప్రధానమంత్రిగా 5ఏళ్లలో ఆయన తీసుకున్న నిర్ణయాలు, పరిపాలనా విధానం నచ్చబట్టే ప్రజలు 2009లో కూడా తిరిగి అధికారాన్ని కట్టబెట్టారు.

కాని నిన్నటి వరకు ఎవరెస్ట్ అంత వున్న ఆయన ప్రతిష్ట ఇప్పుడు పాతాళానికి పడిపోయింది. యూపిఏ ప్రభుత్వంలో వెలుగుచూసిన కుంభకోణాలు గిన్నీస్‌రికార్డే. ఇన్ని కుంభకోణాలు గతంలో ఏ ప్రభుత్వంలోనూ నమోదు కాలేదు. ఇంత ఖరీదైన కుంభకోణాలు ఎప్పుడూ జరగలేదు. దేశ రాజకీయ చరిత్రనే తిరగరాసిన భోఫోర్స్ కుంభకోణం అయితే వీటి ముందు సముద్రంలో నీటి చుక్క లాంటిదే!

ఆశ్చర్యం ఏంటంటే దేశచరిత్రలోనే అత్యంత భారీ కుంభకోణాలు తన హయాంలోనే వెలుగుచూసినా ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ ఏ మాత్రం చలించకపోవడం. గుండె నిబ్బరంతో ఆ పదవినే అంటిపెట్టుకుని వుండడం. గతంలో వున్న నీతి, నిజాయితీలు ఆయనలో వుండుంటే ఇంత అవినీతికర దిక్కుమాలిన ప్రభుత్వానికి నేను సారథ్యం వహించలేనంటూ ఏనాడో రాజీనామా చేసేసుండాలి. కాని ఇప్పుడాయన విలువలు కలిగిన దేశప్రధాని స్థాయి నుండి రాటుతేలిన రాజకీయ నేతగా మారిపోయాడు. కుంభకోణాల పరంపరలో తన ప్రతిష్ఠ మసిబారిపోయినా పట్టించుకోవడం లేదు.

దేశంలో 2జీ స్పెక్ట్రం, కామన్‌వెల్త్, ఆదర్శ్ హౌసింగ్ వంటి కుంభకోణాలు వెలుగులోకి వచ్చాక... చాలా కాలానికిగాని నిందితులపై చర్యతీసుకోలేకపోయారు. అప్పటికీ నిందితులను కాపాడే ప్రయత్నం గట్టిగానే జరిగింది. ఇందులో ప్రధాని ప్రమేయం కూడా వుంది. ప్రతిపక్షాలు గట్టిగా నిలదీసేసరికి ఈ కుంభకోణాల నిందితులు రాజా, కనిమొళి, సురేష్‌కల్మాడీ, విలాస్‌రావ్‌దేశ్‌ముఖ్‌ల వంటి వారిపై చర్యలకు శ్రీకారం చుట్టారు.

ఇవన్నీ ఒకెత్తయితే బొగ్గుగనుల కేటాయింపుల కుంభకోణం ఏకంగా ప్రధానమంత్రి కార్యాలయాన్నే వేలెత్తి చూపసాగింది. ప్రధానికి తెలిసే కేటాయింపులు జరిగాయనే విషయం తేటతెల్లమవుతుంది. 2జీ స్పెక్ట్రం, బొగ్గు కుంభకోణాల నుండి బయటపడేందుకు కేంద్ర ప్రభుత్వం నిస్సిగ్గుగా చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తుంది. రాజ్యాంగ వ్యవస్థలను తమ తొత్తులుగా మార్చుకుంటూ వాటి ద్వారా క్లీన్‌చిట్ పొందేందుకు వేయాల్సిన ఎత్తులన్నీ వేస్తుంది.

2జీ స్పెక్ట్రం కేసుకు సంబంధించి తాను జేపీసీ (పార్లమెంటరీ స్థాయీ సంఘం) ముందుకొచ్చి అన్నీ చెబుతానన్నా జేపీసీ ఛైర్మెన్ చాకో, రాజాని పిలిపించలేదు. ప్రధానమంత్రికి తెలిసే అన్నీ జరిగాయనేది రాజా వాదన. 2జీ స్పెక్ట్రం కేటాయింపులు కేవలం రాజా ఒక్కడి వల్లే జరిగివుండవు. ఇందులో రాజా స్వార్థం వున్నా, తనకు తెలిసిన వారి కోసం ఆయన తన అధికారాన్ని దుర్వినియోగం చేసివున్నా అది ప్రధానిగా వున్న మన్మోహన్‌సింగ్‌కు ఆర్థికశాఖమంత్రిగా వున్న చిదంబరంకు తెలియకుండాపోదు. ఈ రోజు రాజా చెబుతున్నది కూడా అదే! కాని జేపీసీ ఛైర్మెన్ చాకో మాత్రం ప్రధాని మన్మోహన్ సింగ్‌ను, ఆర్థికమంత్రి చిదంబరాన్ని కడిగిన ముత్యాల్లా చూపించేందుకు కేవలం రాజాను మాత్రమే దోషిగా నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. చాకో పక్షపాత ధోరణివల్లే 30మంది సభ్యులుగల సంయుక్త పార్లమెంటరీ సంఘం నిట్టనిలువునా రెండుగా చీలిపోయింది. సభ్యుల్లోసగం మంది చాకో రాజీనామాకు డిమాండ్ చేస్తుంటే సగంమంది అధికారపార్టీల సభ్యులు మాత్రం నిజాలను తొక్కిపెట్టే చాకో ప్రయత్నాలకు మద్దతు పలుకుతున్నారు.

బొగ్గుస్కాంపై సిబిఐ దర్యాప్తుకు ఆదేశించిన సర్వోన్నత న్యాయస్థానం ఆ విచారణ నివేదికను బహిర్గతం చేయకుండా తనకే అందజేయాలని ఆదేశించింది. కాని సిబిఐ నివేదికను ముందుగా కేంద్ర న్యాయశాఖ మంత్రి అశ్విన్‌కుమార్‌కు అందజేసి, ఆ తర్వాత కోర్టులో ప్రవేశపెట్టింది. బీహార్‌లో పశుదాణా కేసులో ప్రధాన నిందితుడు లాలూప్రసాద్‌యాదవ్‌కే క్లీన్‌చిట్ ఇచ్చిన ఘనుడు సిబిఐ చీఫ్ రంజన్ సిన్హా. కేంద్రప్రభుత్వం పట్ల స్వామిభక్తి నిండుగా వున్న అధికారి కాబట్టే వ్యతిరేకత వచ్చినా ఏరికోరి కేంద్రం ఆయననే సిబిఐ చీఫ్‌గా నియమించింది. ఈ పోకడలు చూస్తుంటే జరిగిన కుంభకోణాలలో వాస్తవాలు వెలికిరావడం అనేది, ఇసుక నుండి నూనెను పిండడమే అవుతుందన్నట్లుంది. సీబీఐపై సుప్రీం వేసిన చీవాట్లతో ప్రభుత్వం పరువుపోయింది. ఏదిఏమైనా ప్రతిభావంతుడిని ప్రధానిని చేసుకున్నామన్న ఆనందాన్ని భారతీయులకు మిగలకుండా చేశాడు ఈ మన్‌మోహనుడు.

### పతనమైన ప్రతిష్ఠ




సిబిఐని కేంద్రప్రభుత్వం బొచ్చుకుక్క కంటే హీనంగా వాడుకుంటుందనేదానికి సుప్రీం కోర్టు వేసిన చీవాట్లే ఉదాహరణ. స్వతంత్ర సంస్థగా పనిచేయాల్సిన సిబిఐ కాంగ్రెస్ బ్యూరో ఆఫ్ ఇన్‌వెస్టిగేషన్‌గా మారిందని దీనిద్వారా తేటతెల్లమైంది. యూపిఏ ప్రభుత్వానికి ఇదో మాయని మచ్చగా మిగిలిపోతుంది.

## 'అంతర్'జాతీయం

- బొగ్గు కుంభకోణం, స్పెక్ట్రమ్ 2జీ స్కాం విషయంలో తాను గాని, కేంద్ర న్యాయశాఖ మంత్రి అశ్విన్‌కుమార్ గాని రాజీనామా చేసే ప్రసక్తే లేదని ప్రధాని మన్మోహన్‌సింగ్ కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. ఈ విషయం న్యాయస్థానంలో వుందని, ఏదైనా న్యాయస్థానమే తేలుస్తుందన్నారు.
- ఇటలీ ప్రధానిగా ఎన్రికోలెట్టా(46) ఆదివారం ప్రమాణస్వీకారం చేసారు. మితవాద, మధ్యేవాద పార్టీల కూటమితో ఆయన సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజార్టీ రాని నేపథ్యంలో రెండు నెలలుగా ఇటలీలో రాజకీయ సంక్షోభం కొనసాగింది, ఎట్టకేలకు దానికి తెరపడింది.
- మహారాష్ట్రలోని షిర్డి ఆలయ ట్రస్ట్‌కు 2012-13 ఆర్థిక సంవత్సరంలో 305.39కోట్ల రూపాయల విరాళాలు అందాయి. 2011-12తో పోలిస్తే 30కోట్లు అదనంగా రావడం విశేషం.
- మిగులు సహజవాయువులను భారత్‌కు తక్కువ ధరకే ఎగుమతి చేసేందుకు అమెరికా చట్టసభ్యులు మద్దతు పలికారు. భారత్‌కు గ్యాస్‌ను సరఫరా చేయడం ద్వారా తమ రాజకీయ పలుకుబడి పెంచుకోవచ్చునని, రష్యా, చైనాల ఆధిపత్యానికి గండికొట్టవచ్చుననేది అమెరికా వ్యూహం.
- భారత భూభాగంలో నాలుగోవంతు ప్రాంతం తడారిపోయి ఎడారిగా మారిపోయిందని కేంద్రప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. దేశంలోని 7,91,475 చదరపు కిలోమీటర్ల భౌగోళిక ప్రాంతాన్ని కరువు సమస్యలు పీడిస్తున్నాయని 'ఐక్యరాజ్య సమితి ఎడారీకరణపై యుద్ధం సదస్సు'కు ఇచ్చిన నివేదికలో కేంద్రం పేర్కొంది.
- భారత భూభాగం లడఖ్‌లోకి చైనా దళాలు చొచ్చుకువచ్చిన నేపథ్యంలో మే 9న జరగాల్సిన తన చైనా పర్యటనను విదేశాంగశాఖ మంత్రి సల్మాన్‌ఖుర్షీద్ రద్దు చేసుకోవాలని బీజేపీ అధ్యక్షులు రాజ్‌నాథ్‌సింగ్ డిమాండ్ చేసారు. మంత్రి చైనా పర్యటనకు వెళ్లకుండా ప్రధాని అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేసారు.
- ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ప్రతిష్ఠాత్మక స్టాటిస్టికల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆసియా పసిఫిక్ పాలకమండలిలో భారత్‌కు స్థానం లభించింది. ఈ మండలిలో 41సభ్యదేశాలున్నాయి. మండలిలో 8స్థానాలకు 16దేశాలు పోటీ పడగా, భారత్, ఆస్ట్రేలియాలకు అత్యధికంగా 30ఓట్లు చొప్పున వచ్చాయి. పాకిస్థాన్‌కు కేవలం 20ఓట్లే రావడంతో సభ్యత్వం దక్కలేదు.

## వార్త వ్యాఖ్య

వార్త :- వస్త్రాలపై వ్యాట్ తొలగింపు. - ముఖ్యమంత్రి కిరణ్.
వ్యాఖ్య :- *ఓట్ల వేట మొదలయ్యిందా?*

వార్త :- త్వరలో రెండోదశ పోరాటం. - చంద్రబాబు.
వ్యాఖ్య :- *మొదటిదశ పెద్దగా ఫలితం కనిపించలేదా?*

వార్త :- బాబుకు ప్రతిపక్ష హోదా కూడా మిగలదు. - మంత్రి శైలజానాథ్.
వ్యాఖ్య :- *అల్‌రెడీ మీరు రిజర్వు చేసుకున్నారా?*

వార్త :- అవినీతిపరుల ఆస్తులు జప్తుచేయాలి. - లోకమీషన్ ఛైర్మెన్ జస్టిస్ జీవన్‌రెడ్డి.
వ్యాఖ్య :- *అన్నీ ఆస్తులు జప్తు అయితే వరల్డ్‌బ్యాంకును మించిపోమూ!*

వార్త :- అవినీతికర పార్టీలను తరిమికొట్టండి. - కర్నాటక ప్రచారంలో చిరంజీవి పిలుపు.
వ్యాఖ్య :- *కాంగ్రెస్‌లో వుంటూ ఆ పార్టీనే తరిమికొట్టమంటే ఎలా?*

వార్త :- రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి దయనీయం. - సీతారాం ఏచూరి.
వ్యాఖ్య :- *దేశమంతా ఏదో బాగున్నట్లు...*

వార్త :- కన్నడనాట వెలుగునింపేది కాంగ్రెస్సే. - సోనియా.
వ్యాఖ్య :- *దేశంలో ఏ మాత్రం నింపారో చూస్తున్నాం కదా!*

వార్త :- చంద్రబాబే మళ్ళీ సీఎం. - బాలకృష్ణ జోస్యం.
వ్యాఖ్య :- *ఆయన్ను సీఎంగా పెట్టి ఏదన్నా సినిమా ప్లాన్ వేస్తున్నారా?*

వార్త :- ఎన్నికల తర్వాతే మూడో ఫ్రంట్. - ములాయంసింగ్‌యాదవ్.
వ్యాఖ్య :- *ఫలితాలను బట్టి పెడతారు... అంతేగా!*

వార్త :- రూ.3 తగ్గిన పెట్రోల్.
వ్యాఖ్య :- *ఇలాంటి షాక్‌లను ప్రజలు తట్టుకోగలరా?*

వార్త :- స్త్రీల పాలిట యమలోకం ఢిల్లీ. - కేంద్రమంత్రి రామచంద్రన్.
వ్యాఖ్య :- *యమలోకం వాళ్లు కూడా దీనినే రాజధానిగా పెట్టుకున్నారేమో?*

వార్త :- తెలంగాణ ఇవ్వకుంటే కాంగ్రెస్ భూస్థాపితం. - కోదండరాం.
వ్యాఖ్య :- *ఇవ్వకపోయినా అదే పరిస్థితి.*

# జవసత్వాలున్న నేత జగన్ ఒక్కడే!

ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా వైయస్సార్సీపీ నెల్లూరు నగర సమన్వయకర్త డా॥పి.అనిల్‌కుమార్‌యాదవ్ నెల్లూరులోని రైతుబజార్ కూడలి, చాకలివీధి ప్రాంతాలలో గడపగడపకు వెళ్ళి కాంగ్రెస్‌పార్టీ ప్రజా వ్యతిరేక చర్యలను ఎండగడుతూ వైయస్సార్సీపీ విధి విధానాలను తెలిపారు. పేద ప్రజల అభ్యున్నతి కోసం దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యిందని, అవి అమలులోకి రావాలంటే ఒక్క జగనన్నకే సాధ్యమని తెలిపారు. పేద విద్యార్థుల కోసం ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్సుమెంట్ పథకం అమలు చేయడంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పూర్తిగా విఫలమవడంతో విద్యార్థులు చదువులు మధ్యలోనే ఆగిపోయే దుస్థితి నెలకొందన్నారు. రాష్ట్రానికి కావలసిన విద్యుత్ ఉత్పత్తికి చర్యలు తీసుకోలేని ఈ ప్రభుత్వం అనేకసార్లు విద్యుత్ చార్జీలను పెంచి, వాటికి సర్‌చార్జీలను జోడించి ప్రజలను నానాఇబ్బందులకు గురిచేస్తుందని తెలిపారు. కాంగ్రెస్‌పార్టీ, తెలుగుదేశం పార్టీతో కుమ్మక్కై సిబిఐని పావులా వాడుకుంటూ జగనన్నను అకారణంగా 11నెలలకు పైగా జైలులో పెట్టారన్నారు. కాంగ్రెస్ పార్టీలో విలీనం కాకపోతే ఎప్పటికీ జైలేనని బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని కాని వైయస్ జగన్మోహన్‌రెడ్డి తాటాకు చప్పుళ్ళకు బెదరని, మాటతప్పని, మడమతిప్పని నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు ముక్కాల ద్వారకానాథ్, వెడిచర్ల శివకుమార్, బట్టా కోటేశ్వరరావు, సరాబు సుబ్రహ్మణ్యం, కొండపనాయుడు, దార్ల వెంకటేశ్వర్లు, లోకిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ముప్పసాని శ్రీనివాసులు, సంక్రాంతి కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రజలను పలకరిస్తున్న పి.అనిల్‌కుమార్‌యాదవ్

## ఏసిబికి అడ్డంగా దొరికిన ఆర్ఐ

నెల్లూరుజిల్లా చేజర్ల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.పెంచలయ్య బుధవారం అవినీతి అధికారులకు అడ్డంగా బుక్ అయ్యారు. వివరాలలోకి వెళితే చేజర్ల మండలం మడపల్లి గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైంది. ఇంటి నిర్మాణానికి మూడు విడతలుగా మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పెంచలయ్య తనిఖీచేసి నగదు మంజూరు నివేదిక పంపాల్సి వుంది. ఆర్ఐ పెంచలయ్య నివేదిక అనంతరం లబ్ధిదారుడికి ప్రభుత్వం నుండి 45వేల రూపాయలు నగదు మంజూరుకావాల్సి వుంది. అయితే ఆర్ఐ పెంచలయ్య ప్రభుత్వం నుండి వచ్చే 45వేల రూపాయల నగదు మంజూరుకు బాధితుడు వద్ద నుంచి 4వేల రూపాయలు నగదును డిమాండ్‌చేసాడు. ఈ మేరకు బాధితుడు ఏసిబి అధికారులను కలవగా ఏసిబి అధికారులు పౌడర్ చల్లిన నగదును ప్రసాద్‌కు ఇచ్చారు. ప్రసాద్ అయ్యప్పగుడి వద్దకు వెళ్ళి ఆర్ఐ పెంచలయ్యకు ఇస్తుండగా ఏసిబి డిఎస్పీ భాస్కరరావు దాడిచేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పెంచలయ్య వద్ద నుండి 4వేల రూపాయలు నగదును స్వాధీనం చేసుకుని పెంచలయ్యను ఏసిబి కార్యాలయానికి తరలించారు. అతనిపై కేసు నమోదు అరెస్ట్ చేసినట్లు డిఎస్పీ భాస్కరరావు తెలిపారు. ఈ దాడిలో ఏసిబి సిఐలు కృపానందం, చంద్రమౌళి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వీధినపడ్డ విభేదాలు

(మొదటిపేజీ తరువాయి)

వెంకటగిరి కన్వీనర్ కొమ్మి లక్ష్మయ్య నాయుడులు హాజరు కాలేదు. వీరంతా కూడా ఉద్దేశ్యపూర్వకంగానే ఎగ్గొట్టారు. ఆత్మకూరు కన్వీనర్ మేకపాటి గౌతంరెడ్డి ఈ జిల్లాలో లేక రాలేక పోయినట్లు తెలుస్తుంది. ఇక్కడే వుండుంటే ఆయనకు గైర్హాజరు కావాల్సిన అవసరం లేదు. వైరివర్గం నుండి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఒక్కరే మురళీధర్ స్వాగత కార్యక్రమానికి హాజరు కావడం జరిగింది.

ఇదంతా ఒకెత్తయితే కరెక్ట్‌గా కొత్త కన్వీనర్ పార్టీ కార్యాలయానికి వచ్చిన రోజే, ఆ పార్టీ కార్యాలయానికి మూతేయడం మరింత వివాదాన్ని రేకెత్తిస్తుంది. కాకాణీ పార్టీ కన్వీనర్ అయ్యాక కలెక్టర్ బంగ్లా సమీపంలో ఓ భవనాన్ని అద్దెకు తీసుకుని అందులోనే జిల్లా పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసారు. ఇంతవరకు జిల్లా పార్టీ కార్యక్రమాలన్నీ కూడా అక్కడే జరుగుతూ వచ్చాయి. కాకాణి కన్వీనర్ పదవికి రాజీనామా చేసిన తర్వాత పార్టీ కార్యాలయానికి కూడా దూరమయ్యాడు. దీంతో పార్టీ కార్యాలయం వున్న భవన యజమాని డైలమాలో పడ్డాడు. కాకాణి వున్నంతవరకు అద్దె ఖచ్చితంగా వచ్చింది. ఇకముందు అద్దె ఎవరు కడతారు? కాకాణి అంటే నమ్మకముంది! ఆయన లేకపోతే ఇంకెవరిని నమ్మాలి? ఈ పరిస్థితుల్లోనే పార్టీ కార్యాలయానికి ఆ భవనం యజమాని తాళం వేసుకున్నాడు. తన జాగ్రత్త తాను తీసుకున్నాడు. రైల్వేస్టేషన్ నుండి జోరుగా హుషారుగా ఇక్కడికొచ్చిన మేరిగ మురళీధర్ బృందానికి పార్టీ కార్యాలయం గేట్లకు వేసిన తాళం బుర్ర వెక్కిరించింది. దీంతో వాళ్ళు చేసేదేమీ లేక అక్కడ పార్కింగ్ స్థలంలోనే విలేకరులతో మాట్లాడి తర్వాత మేకపాటి హౌస్‌కు పోయారు.

జిల్లా వైకాపాలో విభేదాలు ఏ స్థాయిలో వున్నాయనేదానికి ఇవి ఉదాహరణలు. జగన్ జైలు బయటకొస్తేగాని ఈ విభేదాలు దారికొచ్చేటట్లు లేవు.

## సిబిఐ

(మొదటిపేజీ తరువాయి)

సిబిఐకి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించే దిశగా సుప్రీం చర్యలు చేపట్టింది. సిబిఐ తీరుపై ఆ సంస్థపైనే నమ్మకం పోయినట్లు సుప్రీం కోర్టు అభిప్రాయపడింది. సిబిఐ ఇలానే పనిచేస్తే ఆ సంస్థ దేశానికి అవసరం లేదు. దానిని కాంగ్రెస్ అనుబంధ సంస్థగానే కొనసాగించవచ్చు. జాతి ప్రయోజనాల కోసం పనిచేసే ఒక స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఇప్పుడు దేశానికి అవసరం. అలాంటి కొత్త వ్యవస్థను అందించేందుకు సర్వోన్నత న్యాయస్థానం చొరవచూపాల్సి వుంది.

## కిరణయ్య

(మొదటిపేజీ తరువాయి)

ప్రవేశపెట్టిన పథకాలకు కిరణ్ పాడె కట్టాడు. అంతేకాదు కరెంట్ ఛార్జీలను పెంచి ఓటర్లను కాంగ్రెస్‌కు ఇంకా దూరం చేసాడు. ఆయనకు పీసీసీ అధ్యక్షుడితో పడదు. డిప్యూటీ సీఎంతో కుదరదు... సగం మందికిపైగా మంత్రులతో సఖ్యత లేదు. తెలంగాణ కాంగ్‌నేతలతో అసలు పొసగడం లేదు. ఇంతమంది వ్యతిరేకిస్తున్నా, నా దారి నాదే అంటున్నాడు కిరణ్!

## వైభవంగా త్యాగరాజ గానసభ వార్షికోత్సవం

నెల్లూరు పురమందిరంలో త్యాగరాజగానసభ మందిరం 4వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం రాత్రి వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రభుత్వ సంగీత, నృత్య పాఠశాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులు శాస్త్రీయ సంగీతాన్ని ఆలపించి శ్రోతలను ఆకట్టుకున్నారు. అనంతరం శ్రీ గురుకృప కళాక్షేత్రం అధినేత్రి సురభిగాయత్రి శిష్యబృందం కూచిపూడి, భరతనాట్యం ప్రదర్శనలు ఇచ్చి అందరిని అలరించారు. బిసి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్ మాట్లాడుతూ కళలు, కళాకారులకు నిలయమైన సింహపురి సీమలో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన జువ్వలదిన్నె వెంకయ్య, సి.మునికుమార్, నెల్లూరు మస్తాన్‌బాబు, సురభిగాయత్రి, ఎల్.కనకదుర్గ, బివి.సుబ్రహ్మణ్యంలను సత్కరించారు. కళాకారుల నాదస్వర కచ్చేరి ఆకట్టుకుంది. ఈ కార్యక్రమాలను అధ్యక్షుడు కనియంపాటి వీరరాఘవులు తదితరులు పర్యవేక్షించారు.



సురభి గాయత్రిని సత్కరిస్తున్న అతిథులు

## జడ్పీ ఇన్‌ఛార్జి డిప్యూటీ సీఈఓ సస్పెన్షన్

నెల్లూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి రాలేదని ఇన్‌ఛార్జి డిప్యూటీ సిఈఓ జాలిరెడ్డిని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ సస్పెండ్ చేసారు. జాలిరెడ్డిని కలెక్టర్ పిలిపించి సమావేశానికి ఎందుకు రాలేదని ప్రశ్నించగా, తాను ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తుండడం వల్ల రాకూడదనుకుని రాలేదని సమాధానమిచ్చాడు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ ఇటీవల ఆత్మకూరులో జరిగిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సభలో ఏ హోదాతో వేదిక మీదకు వచ్చావని నిలదీశారు. అరగంటలో సస్పెండ్ చేయాలని జడ్పీ సిఈఓ వీరభద్రయ్యను ఆదేశించారు.

## న్యాయమూర్తుల బదిలీలు

నెల్లూరు జిల్లాలోని పలువురు న్యాయమూర్తులను బదిలీ చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. నెల్లూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి మాధవీకృష్ణను ఖమ్మంకు బదిలీచేశారు. ఈమె స్థానంలో శ్రీకాకుళం మొబైల్ కోర్టు న్యాయమూర్తి చినబాబు నియమితులయ్యారు. మొదటి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి సతీష్‌కుమార్‌ను ఖమ్మం ఎక్సైజ్ కోర్టుకు బదిలీచేశారు. ఈయన స్థానంలో నెల్లూరు ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి హేమలతను నియమించారు. ఆమె స్థానంలో శ్రీకాకుళం నుంచి పద్మను నియమించారు. మొబైల్‌కోర్టు న్యాయమూర్తి రాజేష్‌కుమార్‌ను విజయనగరం అదనపు జూనియర్ సివిల్ జడ్జిగా బదిలీచేశారు. కోట మెజిస్ట్రేట్ వెంకటశేషమ్మ విజయవాడ నాల్గవ అదనపు జ్యూడిషియల్ కోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో రైల్వేకోడూరు కోర్టు మెజిస్ట్రేట్ కృష్ణవేణిని నియమించారు.



PDF Compressor Free Version





సోమవారం నెల్లూరు పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్, రూరల్ డీఎస్పీ బాలవెంకటేశ్వరరావు

## మా సమస్యలను పరిష్కరించండి దొర



డిజిపి దినేష్‌రెడ్డితో జిల్లా పోలీస్ అధికారుల సంఘం నేతలు

పోలీసు సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపి పోలీసుల అధికారుల సంఘం జిల్లా కమిటీ సంఘ నాయకులు గత నెల 28న పోలీసు అతిథిగృహంలో డిజిపి దినేష్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు మాట్లాడుతూ పోలీసు సబ్సిడి క్యాంటిన్, టైలరింగ్ సెంటర్, నూతన డార్మెంటరీ నిర్మాణానికీ నిధులు మంజూరు చేయాలని కోరారు. మూడేళ్ళ సర్వీసు పూర్తి చేసుకున్న హెడ్‌కానిస్టేబుళ్లకు శాశ్వత ప్రాతిపదికన ఏఎస్‌ఐలుగా పదోన్నతి కల్పించాలన్నారు. 1989 బ్యాచ్ ప్రస్తుత సిఐలను డిఎస్పీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. సమస్యలు తెలుసుకున్న డిజిపి త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జి.అంజిబాబు గౌరవాధ్యక్షుడు శ్రీహరి, ఉపాధ్యక్షులు ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, డి.జగన్మోహన్‌రావు, కోశాధికారి బాబు, సంయుక్త కార్యదర్శి వీరాంజనేయులు, కార్యనిర్వాహకకార్యదర్శి కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సంతపేటలో ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు సంతపేటలోని ఓబయ్య బడిలో గతనెల 28న వాసవీక్లబ్ శ్రీశ్రీనివాస ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పార్థ డెంటల్ ఆసుపత్రి, చందమామ తల్లీపిల్లల ఆసుపత్రి వైద్య సిబ్బంది పేదలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా క్లబ్ రీజియన్-1 గవర్నర్ సంబూరి వెంకట పద్మజ మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు తమ సంస్థలో సభ్యులుగా చేరి సేవలందించాలని కోరారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధిగ్రస్తులకు దుస్తులు పంపిణీచేసారు. కార్యక్రమంలో క్లబ్ జోన్ ఛైర్మన్ పిండి వెంకటలక్ష్మి, ప్రాజెక్ట్ ఛైర్మన్ సురేఖ, అధ్యక్షురాలు డి.సుధారాణి, కార్యదర్శి ఉమామహేశ్వరి, కోశాధికారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## సబ్ ప్లాన్‌పై అవగాహన సదస్సు



మహిళలకు చెక్కులు అందజేస్తున్న ముంగమూరు

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేట వప్పులవీధిలోని వైవియం నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలలో గతనెల 27న ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టంపై అవగాహన సదస్సు జరిగింది. సదస్సులో పాల్గొన్న నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి మాట్లాడుతూ పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి కోసం 1200కోట్లు కేటాయించిందని తెలిపారు. సదస్సులో కాంగ్రెస్ నాయకులు ఆనం రంగమయూర్‌రెడ్డి, కిన్నెర ప్రసాద్, నిరంజన్, గురవయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరు కబుర్లు

## నెల్లూరులో 'నీట్'

దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల్లో ప్రవేశానికి ఒకే ప్రవేశ పరీక్ష వుండాలని కేంద్రప్రభుత్వం నీట్(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్‌టెస్ట్)ను ఈ ఏడాది నుండి ప్రవేశపెట్టడం జరిగింది. మన రాష్ట్రంలో 'నీట్' కోసం నాలుగు కేంద్రాలను ఎంపికచేయగా వాటిలో నెల్లూరు వుండడం విశేషం. ఈనెల 5వ తేదీ ఉదయం 10గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు ఈ పరీక్ష జరుగనుంది. నెల్లూరులో ప్రభుత్వ బాలుర పాలిటెక్నిక్ కాలేజీ, కృష్ణచైతన్య కాలేజీ, సర్వోదయ కాలేజీ, వి.ఆర్.కాలేజీ, బాలికల పాలిటెక్నిక్ కాలేజీ, డికెడబ్ల్యు కాలేజీ, గోమతి స్కూల్, సెయింట్ జోసెఫ్ హైస్కూల్, వెంకటాచలంలో క్యూబా ఇంజనీరింగ్ కాలేజీ, నార్త్ రాజుపాలెంలో బ్రహ్మయ్య ఇంజనీరింగ్ కాలేజీ, కోవూరులో గీతాంజలి ఇంజనీరింగ్ కాలేజీలలో ఈ పరీక్ష జరుగనుంది. నెల్లూరు, ప్రకాశం, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల నుండి మొత్తం 5239మంది విద్యార్థులు 'నీట్' రాయనున్నారు.

## ఖజానాలో తమన్నా



నెల్లూరు నగరం ఆచారివీధిలో నెలకొల్పిన ఖజానా జ్యూవలరీ నూతన షోరూంను ప్రముఖ సినీనటి తమన్నా ఇటీవల ప్రారంభించారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసిన తమన్నా పలు రకాల డిజైన్ల ఆభరణాలను ధరించి సందడి చేశారు. ఖజానా జ్యూవలరీ మేనేజింగ్ డైరెక్టర్ కిషోర్‌జైన్ మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా తమ సంస్థ ఆధ్వర్యంలో నాణ్యమైన ఆభరణాలను విక్రయిస్తున్నామన్నారు. తమకు సొంత ఉత్పత్తి కేంద్రం ఉండడంవల్ల ఆభరణాల డిజైన్, నాణ్యత, నగిషీ విషయాల్లో రాజీ పడకుండా నాణ్యమైన ఆభరణాలను అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 17నగరాల్లో 26షోరూంలను ఏర్పాటు చేశామన్నారు. అన్ని ఆభరణాలకు బీఎస్ఐ 916 హాల్‌మార్క్ ఉండటం తమ ప్రత్యేకతన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర్‌కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆనం నెంబర్-1

నెల్లూరుజిల్లా రవాణాశాఖ కార్యాలయంలో వాహనాలకు కేటాయించే నంబర్లకు గత నెల 27 నుంచి ఏడబ్ల్యు కొత్త సీరీస్ ప్రారంభమైంది. ఏపీ 26 ఏడబ్ల్యు సీరీస్‌లోని మొదటి నెంబరు "1" ని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి కొరకు కేటాయించినట్లు తెలిసింది. ఈ ఫ్యాన్సీ నెంబరు కోసం ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం 50వేలు మంత్రి చెల్లించినట్లు సమాచారం. ఈ మేరకు రవాణా శాఖాధికారులు ఈ నెంబరును రిజర్వులో ఉంచారు. ఈ నెంబరుకు ఇతరులు పోటీకి రాకుంటే ఏపీ 26 ఏడబ్ల్యు "1" నెంబరును రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రికి కేటాయించే అవకాశముంది.

## ఐటి విద్యార్థులకు ఎన్నికల సంఘం ఆహ్వానం

గ్రామ పంచాయితీ సాధారణ ఎన్నికల నిర్వహణలో పోలింగ్ తీరు పర్యవేక్షణలో భాగంగా పోలింగ్‌స్టేషన్‌లో వెబ్ క్యాస్టింగ్ చేయుటకు ఐటి విద్యార్థుల సేవలను వినియోగించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం వివిధ ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు ఆహ్వానం పలుకుతోంది. స్వంతంగా ల్యాప్‌టాప్ కంప్యూటర్ కలిగి వున్న ఐటి విద్యార్థులు వారి కళాశాల యాజమాన్యం ద్వారా జిల్లా పంచాయితీ అధికారి కార్యాలయానికి అంగీకారం తెలియజేయమని జిల్లా ఎన్నికల అధికారి అయిన జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. వెబ్‌క్యాస్టింగ్ ప్రక్రియలో పాల్గొను విద్యార్థులకు ప్రయాణ, భోజన వసతితో పాటు 500/-రూ॥ల పారితోషికం ఇస్తారని తెలిపారు. అంతేకాక ఆ విద్యార్థులకు వెబ్‌క్యాస్టింగ్ కార్యక్రమంలో పాల్గొన్నట్లు సర్టిఫికేటు ఇస్తామని తెలిపారు.

## అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం

భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్‌పై అమలాపురం పాస్టర్ పి.డి.సుందరం చేసిన వ్యాఖ్యలకు నిరసనగా దళిత అభ్యుదయ సమితి ఆధ్వర్యంలో ఆదివారం నెల్లూరు నగరంలోని అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసారు. అనంతరం పాస్టర్ సుందరం దిష్టిబొమ్మను దహనం చేసారు. సమితి అధ్యక్షుడు వాదనాల వెంకటరమణ మాట్లాడుతూ అంబేద్కర్‌ను అవమానించడం పార్లమెంటరీ వ్యవస్థను అవమానించడమేనన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు సునీల్‌రాజు, గంగాధర్, మోహన్ విజయకుమార్, గోపాల్, శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భానుడి భగ..భగ...

భానుడి సెగలు భగభగమంటున్నాయి. దాదాపు 15రోజులు క్రితం ఉగ్రరూపం చూపిన భానుడు వారం రోజులుగా శాంతించాడు. మరలా మూడు రోజులు నుండి ఎండలు తీవ్ర రూపం దాల్చాయి. 17వతేది అత్యధికంగా రికార్డుస్థాయిలో 43.9డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది. ఆ తర్వాత అల్పపీడనం ప్రభావం వల్ల వాతావరణం చల్లబడింది. ఈ క్రమంలో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఉదయం 9గంటల నుండి ఎండ తీవ్రంగా పెరుగుతుండడంతో జనం బయటకు రావాలన్నా జంకుతున్నారు. విద్యుత్ కోతలు అధికంగా ఉండడంతో ఇళ్ళలో ఉండలేక అల్లాడుతున్నారు.


## వ్యాట్ రద్దుపై వస్త్ర వ్యాపారుల హర్షం

రాష్ట్రంలో దుస్తుల అమ్మకంపై వ్యాట్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై జిల్లాలోని వస్త్ర వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి కార్యాలయంలో వస్త్ర వ్యాపారులు, మంత్రులు, శాసన సభ్యులతో జరిపిన చర్చలు సఫలమవ్వడంతో, తమ పోరాటానికి సహకరించిన వారికి, వ్యాట్‌ను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్ రెడ్డికి, మంత్రులకు జిల్లా వస్త్ర వ్యాపారుల సంఘం అధ్యక్షుడు నాగసూరి కామేశ్వరరావు, కార్యదర్శి చలువాది వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

## 12న మోడల్ డైట్‌సెట్

రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ శిక్షణకు సంబంధించి మే 12వ తేదీన మోడల్ డైట్‌సెట్‌ను నిర్వహిస్తున్నట్లు డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి.వి.వి.ప్రసాద్ తెలిపారు. జిల్లాలో 13 కేంద్రాల్లో ఈ పరీక్షను నిర్వహిస్తున్నామన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు శిక్షణ పొందుతున్న కోచింగ్ సెంటర్ వద్ద, బాలాజీనగర్‌లోని డా॥ రామచంద్రారెడ్డి భవన్‌లో మే నెల 6వతేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. పరీక్ష రాయదలచుకొన్న విద్యార్థులు 94946 46461, 92487 12526నంబర్లకు ఫోన్‌చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు బాలసుబ్రహ్మణ్యం, శ్రీకాంత్, ఫయాజ్, కావయ్య, సుధీర్, సురేష్ పాల్గొన్నారు.

## డిటీసీ ప్రసాదరావుకు పదోన్నతి



నెల్లూరు రవాణాశాఖ ఉపకమీషనర్ ఎస్‌వీ ప్రసాదరావుకు జాయింట్ కమీషనర్‌గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఉపకమీషనర్‌గా ఉన్న ప్రసాదరావుకు పదోన్నతి కల్పించి హైదరాబాద్‌లోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీచేసింది. ఈయన స్థానంలో విజయవాడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ మోహన్ నియమితులవుతున్నారని సమాచారం.

PDF Compressor Free Version



## పుణ్యక్షేత్రాల్లో...

# భక్తుల సౌకర్యాలకు పెద్దపీట

సింహపురి సమాచారం



పెంచలకోనలో అతిథిగృహాలను ప్రారంభిస్తున్న ఆనం, వట్టి వసంతకుమార్

నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో గతనెల 27న రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖమంత్రి వట్టి వసంతకుమార్‌లు అమ్మహస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం మాట్లాడుతూ తెల్లరేషన్ కార్డుల ప్రయోజనార్థం నిత్యావసర వస్తువులను చౌకగా పంపిణీ చేసేందుకు అమ్మహస్తం కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్నామన్నారు. 292రూ॥లు విలువజేసే 9రకాల నిత్యావసర వస్తువులైన కందిపప్పు, పామాయిల్, గోధుమపిండి, గోధుములు, చక్కెర, ఉప్పు, కారం, చింతపండు, పసుపులను కేవలం 185రూ॥లకే అందిస్తున్నామన్నారు. మే 1 నుండి మన బియ్యం పథకం అమలు చేస్తామని తెలిపారు. మంత్రి వట్టి వసంతకుమార్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకపరంగా అభివృద్ధి చెందేందుకు 160కోట్లు మంజూరు చేయడం జరిగిందని జిల్లాకు దాదాపు 50కోట్లు మంజూరు చేసామని తెలిపారు. ఈ సందర్భంగా 4.50కోట్లతో నిర్మించిన టూరిజం ఎకోపార్కు, పర్యాటకుల వసతి గృహాలు, అతిథి గృహాలను మంత్రులు ప్రారంభించారు. తదుపరి నరసింహకొండ, జొన్నవాడలలో కూడా పర్యాటకుల వసతి గృహాలు, అతిథిగృహాలను ప్రారంభించారు.

కార్యక్రమంలో జె.సి.బి.లక్ష్మీకాంతం, జిల్లా సహకార బ్యాంక్ అధ్యక్షులు యం.ధనుంజయరెడ్డి, జిల్లా మార్కెటింగ్ ఛైర్మెన్ సుమంత్‌రెడ్డి, నేదురుమల్లి రాంకుమార్, అదనపు జె.సి.సి.హెచ్. పెంచలరెడ్డి, పర్యాటకశాఖ అధికారి మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సిటీ అభివృద్ధి అదరహో...



నెల్లూరు, చిత్తూరుజిల్లాల సరిహద్దుల్లో వెలసి పారిశ్రామికంగా వేగవంతమైన అభివృద్ధిని సాధిస్తున్న శ్రీసిటీని గతనెల 27న జాతీయ రహదారుల శాఖ హైదరాబాద్ చీఫ్ జనరల్ మేనేజర్ ఐజిరెడ్డి, డిజియం శ్రీనివాసన్, నెల్లూరు ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎవి రావులు సందర్శించారు. అక్కడ అభివృద్ధిని చూసి వారు ఆశ్చర్యపోతూ ఒకప్పుడు ఎంతో వెనుకబడిన ఈ ప్రాంతం అతి తక్కువ కాలంలో కొత్త రూపు సంతరించుకోవడం పట్ల శ్రీసిటీ ఎం.డి.రవిసన్నారెడ్డి కృషిని ప్రశంసించారు.



బుచ్చిరెడ్డిపాలెం మండలం, మంగళకట్ట గిరిజనులకు ఇటీవల జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఒక్కో ఇంటికి 35కేజీల బియ్యాన్ని ప్రతిఒక్కరికీ ఇళ్ళ స్థలాన్ని మంజూరు చేసారు. దీనికిగాను నెల్లూరు కలెక్టర్ కార్యాలయానికి వచ్చి, కలెక్టర్ బి.శ్రీధర్‌కు స్వయంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్న ఆ కాలనీ గిరిజన మహిళలు

# మంచి సమాజం కోసం కృషి చేద్దాం!



సభలో ప్రసంగిస్తున్న డిజిపి వి.దినేష్‌రెడ్డి

హెచ్ఐవి లేని సమసమాజ స్థాపనకు పోలీసుశాఖ తమవంతు కృషి చేస్తుందని రాష్ట్ర డిజిపి దినేష్‌రెడ్డి పేర్కొన్నారు. గత నెల 27న నెల్లూరులోని ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో జిల్లాలోని స్వచ్ఛంద సంస్థలు, సెక్స్‌వర్కర్లుతో హెచ్ఐవి -ఎయిడ్స్ నివారణ, మానవ హక్కుల సాధనలో పోలీసుపాత్ర అనే అంశంపై నిర్వహించిన సదస్సులో డిజిపి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ దేశంలోనే మన రాష్ట్రం ప్రథమస్థానంలో హెచ్ఐవి ఉండేదని ప్రస్తుతం వ్యాధి నియంత్రణలో మనమే ముందున్నామన్నారు. అందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో కలిగించిన అవగాహనే కారణమన్నారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధిగ్రస్తుల జీవిత కాలాన్ని పెంచేందుకు ఏఆర్‌టిసి సెంటర్ల ద్వారా ఉచితంగా మందులు, పించన్లు పంపిణీ చేస్తారన్నారు. జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ మాట్లాడుతూ జిల్లాలో సెక్స్‌వర్కర్లుకు, హిజ్రాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పోలీసులు అండగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఏ ఎస్పీ ఐఆర్ఎస్ మూర్తి, అదనపు డిఎంహెచ్ఓ డా॥ పద్మావతి, ఐసిడిఎస్ ఏపిడి విజయలక్ష్మి, స్వచ్ఛందసంస్థల జిల్లా అధ్యక్షుడు ఇవియస్ నాయుడు, డిఎస్పీలు వెంకటనాథ్‌రెడ్డి, బాలవెంకటేశ్వరరావు, రాజ మహేంద్రనాయక్, ఇందిర, సిఐ జయరామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.


అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము. ఆదివారం షాపు గలదు.

నెల్లూరులో...
అంతర్జాతీయ ప్రమాణాలు
జాతీయ సంప్రదాయాలు
మిళితమైన విద్యాలయం.

భారతీయ హృదయాలకు విశ్వవిజ్ఞానాన్ని జోడించి,
ప్రతి విద్యార్థిలోని సృజనాత్మకతను వెలికితీసి, చురుకైన...
భావిభారత దిశానిర్దేశకులుగా తీర్చిదిద్ది,
ఉన్నత శిఖరాలకు చేర్చాలన్నదే లక్ష్యంగా...

అక్షర విద్యాలయ
స్వర్ణభారత్ ట్రస్టు ప్రేరణతో

CBSE సిలబస్
idiscoveri భాగస్వామ్య పాఠశాల




2013-14 అడ్మిషన్లు జరుగుచున్నవి.
తరగతులు I నుండి IX డే స్కాలర్స్
తరగతులు IV నుండి IX హాస్టల్ స్కాలర్స్

బోధన ఆంగ్లం - భావన భారతీయం
- 25 ఎకరాల విశాల ప్రాంగణంలో, అత్యున్నత ప్రమాణాలతో 2 లక్షల చ.అడుగులలో భవన సముదాయం
- పచ్చని పొలాలు, కాలుష్య రహిత గ్రామీణ వాతావరణం
- విశాలమైన 625 చ.అడుగుల తరగతి గదులు
- అధ్యాపక సిబ్బందికి ప్రాంగణంలోనే వసతి
- అన్ని వసతులతో కూడిన హాస్టల్
- సరస్వతీ మందిరం
- ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:15
- "Learning by Doing" విద్యావిధానం
- XSeed Curriculum
- Edu కాన్సెప్ట్
- NIIT మ్యాథ్స్ & మొబైల్ సైన్స్ ల్యాబ్
- రోబోటిక్స్ & లాంగ్వేజ్ ల్యాబ్
- కంప్యూటర్స్ ల్యాబ్
- మ్యాథ్స్ అబాకస్ తరగతులు
- మంచి లైబ్రరి, సాంస్కృతిక విభాగం
- Eco పార్క్ & సైన్స్ పార్క్
- ఆడియో, వీడియో రూమ్
- స్కేటింగ్ మైదానం, వాకింగ్ ట్రాక్
- బాస్కెట్‌బాల్, వాలీబాల్, టెన్నిస్, బ్యాడ్మింటన్
- టేబుల్ టెన్నిస్, స్కూకర్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ
- చెస్, జిమ్, యోగా, ఏరోబిక్స్
- భారతీయ సాంప్రదాయ నృత్యం మరియు సంగీతం
- ఓపెన్ ఎయిర్ థియేటర్
- అడ్వంచర్ క్యాంప్
- ఫీల్డ్ ట్రిప్స్, విజ్ఞాన విహార యాత్రలు
- వైద్య సౌకర్యం
- రెమిడియల్ క్లాసులు

2012-13 'అక్షర' విజయాలు
- దక్షిణ భారత సి.బి.యస్.ఇ. పాఠశాలల 'స్కేటింగ్ ఛాంపియన్ షిప్ అండర్ 12' లో రజత పథకము. అమృతసర్‌లో జరిగిన జాతీయ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనటం.
- ముంబాయిలో పువాయ్ ఐ.ఐ.టి. వారు నిర్వహించిన రోబోటిక్స్ మీట్స్‌లో 4వ స్థానం.
- ఒలింపియాడ్ పరీక్షలలో పాఠశాల సరాసరి శాతం జాతీయ, అంతర్జాతీయ స్థాయిని అధిగమించడం.
- ఎడుబ్రిడ్జ్ ముంబై వారిచే తల్లిదండ్రులకు నేటి తరం పిల్లల పెంపకంలోని మెళకువలు మరియు వారి ఒత్తిడి తీవ్రతను తగ్గించుట' అను అంశంపై సమావేశం నిర్వహించబడినది.

2013-14 సం॥లో 'అక్షర' ఆవిష్కరణలు
- ప్రత్యేక అభ్యసన ఆవశ్యకత గల పిల్లలను గుర్తించి వారికి M.D.A. శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణా తరగతులు.
- భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తెలియజేయటం ద్వారా విద్యార్థులలో మానవత్వ విలువలు పెంపొందించటం. (Moral Science, Indian Culture & Heritage)
- విద్యార్థులు ఆంగ్ల భాషలో పట్టు సాధించుటకు, చదవటం, వ్రాయుటంలో నైపుణ్యము పెంపొందించుటకు ఆంగ్లభాష శిక్షణా కేంద్రం ఏర్పాటు.

సరస్వతి నగర్ (NH-5), వెంకటాచలం,
ఎస్.పి.ఎస్.ఆర్. నెల్లూరు జిల్లా
ఆం.ప్ర.-524320.
ఫోన్ : 0861-2351000,
9963477120, 9963477119
www.aksharavidyalaya.com

కదంబం

## రెక్కల కౌగిలి

సి.హెచ్.వి.బృందావనరావు
విజయవాడ, 9963399189.

రెక్కల కౌగిలి
అక్షాంశాలనీ రేఖాంశాలనీ
అనేకానేక విభాగాలు చేసి
అవని అంగాంగాలనూ భిన్నించగలవుగాని
ఆకాశానికి సరిహద్దుల్ని
ఏర్పరచగలవా నువ్వు?
శీతోష్ణాలకు ఏర్పడే శరీర వర్ణాలను బట్టీ
నల్లవారనీ తెల్లవారనీ మనుజులను
ఎక్కువ తక్కువలుగా వింగడించి
పరస్పర ద్వేషాలకు పాదులు చెయ్యగలవు గాని
దిక్కుల్లో ఎగిరే పక్షుల రంగులను బట్టీ
నీడ జాల నిమ్నాధిక్యాలను నిర్దేశించగలవా నువ్వు?
సైబీరియా హిమానీ విస్తీర్ణాల నుంచి
వేలాది మైళ్ళు క్రమించి క్రమించి
పులికాట్ సరస్తీరాలను పునీతం చెయ్యడానికొచ్చే
ఫ్లైమింగో పక్షులు
నీ వాస్తవాధీనరేఖ వాస్తవికతను ఏడాదేడాదీ
ఆకాశపు దండెం మీద ఆరవేస్తూనే ఉన్నాయి
ఆస్ట్రేలియా హరిత వైశాల్యాలనించి
క్రమం తప్పకుండా కొల్లేటి జలశయ్యమీదికి
విహారానికొచ్చే ధవళవర్ణాల కొంగల గుంపులు
నీ లైనాఫ్ కంట్రోలును తమ రంగు ముక్కుల్తో
రద్దు పరుస్తూ సంతకం చేస్తూనే ఉన్నాయి
ముబ్బులరేవుల దగ్గర
రెక్కల కేతనాలను ఎగరేస్తూనే ఉన్నాయి.
అవి దేశాలనూ, ద్వేషాలనూ ఎరుగవు
ఎల్లలనూ కల్లలనూ ఎరుగవు
నువ్వో!
భూగోళాన్ని శకల శకలాలుగా
భాగహరించగలవు
నాటికల్ కొలతల నాలికలతో
అంభోధుల్ని ఆచమించగలవు
విస్తరిస్తున్న అత్యాశతో-కుంచుకుపోతున్న అంతరంగంతో
దిక్కులన్నిట్నీ దురాక్రమించగలవు
సమస్త విశ్వాన్నీ రెక్కల కౌగిలితో ఆలింగనం చేసుకునే
విహంగాలను చూసైనా విశాల పరచుకోలేవా మనిషీ!
నిన్ను నీవు!

## చరిత్ర నిర్మాతలు ప్రజలేనన్న భారతీయ కవి శ్రీశ్రీ


ప్రసంగిస్తున్న సింగమనేని

చరిత్ర నిర్మాతలు ప్రజలేనని చెప్పిన తొలి భారతీయ కవి శ్రీశ్రీ అని ప్రసిద్ధ సాహితీవేత్త సింగమనేని నారాయణ అన్నారు. నెల్లూరు పురమందిరంలో శ్రీశ్రీ ప్రగతి ట్రస్ట్, వర్ధమాన సమాజం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీశ్రీ 103వ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సింగమనేని మాట్లాడుతూ భారతీయ సాహిత్యంలో శ్రమజీవుల పక్షాన నిలిచిన మొట్టమొదటి వ్యక్తి మహాకవి శ్రీరంగం శ్రీనివాస రావు(శ్రీశ్రీ) అని అన్నారు. వెయ్యేళ్ళ కాలంలో సంఘం, సంఘ జీవితం గురించి ఆలోచించి రాసినందుకు ఆయన తెలుగులోనే కాక భారతజాతి సాహితీవేత్తగా గుర్తింపు పొందారని కొనియాడారు. సాహితీ విమర్శకురాలు డా॥సంజీవమ్మ మాట్లాడుతూ కందుకూరి, గురజాడలో లేని శక్తి శ్రీశ్రీలో ఉండడం వల్లే ఆయన వైతాళికుడయ్యారన్నారు. ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ శ్రీశ్రీని యువత ఆదర్శంగా తీసుకోవాలని, అంతర్జాతీయ స్థానంలో తెలుగు సాహిత్య ఖ్యాతిని ఇనుమడింపజేసిన ఘనత మహాకవి శ్రీశ్రీకి దక్కుతుందని కొనియాడారు. శ్రీశ్రీ రచనలను, కవిత్వాన్ని దశదిశలా వ్యాపింపజేయాలన్న సత్సంకల్పంతో శ్రీశ్రీ ప్రగతి ట్రస్టును ఏర్పాటు చేసిన న్యాయవాది అనంతరామయ్య ఆశయం అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు. అనంతరం ప్రముఖ శాస్త్రవేత్త డా॥తెలికపల్లి సుబ్బయ్యకు వేములపాటి పట్టాభిరామయ్య జ్ఞాపికను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ ప్రగతిట్రస్టీ వేములపాటి అనంత రామయ్య, వర్ధమాన సమాజం కార్యదర్శి మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, సంస్థ గౌరవాధ్యక్షుడు డా॥కాళిదాసు పురుషోత్తం, వంటేరు వెంకట కృష్ణారెడ్డి, ఈతకోట సుబ్బారావు, డా॥ఈదూరు సుధాకర్‌లు పాల్గొన్నారు.

# పుట్టినా మగాడిగా పుట్టకూడదు

### అదీ ఆంధ్రప్రదేశ్‌లో...

శ్రీను గల్పిక

అది బాంబుపేలుళ్ల రహిత నగరంగా ఐఎస్ఐ సర్టిఫికేట్ పొందిన భాగ్యనగరం. సచివాలయంలో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసారు. ఆయనకు ఓ పక్క డిప్యూటీ సీఎం రాజనరసింహ, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, దానం నాగేందర్, పొన్నాల లక్ష్మయ్య, ధర్మాన ప్రసాదరావు, ఇంకో పక్క బొత్స సత్యనారాయణ, పితాని సత్యనారాయణ, గీతారెడ్డి, గల్లా అరుణకుమారి, డి.కె. అరుణ, ముఖేష్‌గౌడ్, కన్నా లక్ష్మీనారాయణలు కూర్చున్నారు. ముఖ్యమంత్రి మొదలుపెట్టాడు.

"చెల్లీ... ఓ చెల్లి
నువ్వే నా బంగారు తల్లి
నీ మనసే సువాసనల మల్లి
నువ్వే నా అందాల జాబిల్లి
ఓ తల్లీ... నువ్వే బంగారు చెల్లి...

అని కవిత చెప్పి, బంగారుతల్లి కార్యక్రమం గురించి వివరించారు. బంగారు తల్లి పథకం క్రింద ఆడపిల్లల చదువుల ఖర్చునంతా ప్రభుత్వమే భరిస్తుంది. ఇంటర్ పూర్తి చేస్తే ప్రోత్సాహంగా 50వేలు ఇస్తాం. డిగ్రీవరకు చదివితే ఇంకో 50వేల రూపాయలు అదనంగా ఇస్తాం. ఇక మీ ఇష్టం. ఆడపిల్లల్ని కనండి... అదృష్టవంతులు కండి... మీ ఇంటి మహాలక్ష్మీ మా ఓటరు మాలక్ష్మి అంటూ కిరణ్ విలేకరుల సమావేశాన్ని ముగించాడు. విలేకరులందరూ వెళ్లిపోయారు. తర్వాత సీఎం అందరికీ హాఫ్‌కప్ చొప్పున ఛాయ్ ఆర్డర్ చేసి.... 'బంగారుతల్లి' అనేది ఓ అద్భుత కార్యక్రమం... దీనిని ప్రజల్లోకి తీసుకెళితే మనకు ఓట్లపరంగా లబ్ధి చేకూరుతుందన్నాడు. మీకేం బాగానే వుంటుంది. నాకే బొక్క అనే మాట వినిపించింది. ఎవరబ్బా ఆ మాటన్నది అంటూ అందరూ గుమ్మంవైపు చూసారు. అక్కడ స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63) నిలబడివున్నాడు. సీఎం కిరణ్ ఆయనను లోపలకు రమ్మని కూర్చోబెట్టి... మీకేం నష్టమన్నా అని అడిగాడు. దానికి వివేకా... నాకు ఇద్దరు కొడుకులు... ఆడపిల్లలు లేరు... నా కొడుకులకు కూతుర్లు పుట్టలేదు. అందరూ మగపిల్లలే. సర్కార్ సొమ్ము తినే అవకాశమే లేకుండా పోయింది. నా డబ్బుతోనే నా కొడుకులను చదివించాను. రేపు మనవళ్లను కూడా సొంతడబ్బులు పెట్టే చదివించాల్సి వస్తుంది. మగపిల్లలకు కూడా 'బంగారుబిడ్డ' అనే పథకం పెట్టి ఉచితంగా చదివించే ఏర్పాటు చేయకూడదా అని అడిగాడు. దానికి కిరణ్... ఇప్పుడు మగాళ్లు చదివి ఉద్ధరించేదేముంది. అయినా మీరు పెద్దగా చదువుకోలేదు కాబట్టే ఈరోజు ఎమ్మెల్యేగా వున్నారు. అదే చదువుకుని వుంటే ఏ ఆఫీసులోనో గుమస్తాగానో వుండేవాళ్లు అని చెప్పాడు. ఆ మాటలకు వివేకాతో పాటు మిగతా వాళ్లు కూడా నోరెళ్లబెట్టారు. తర్వాత కిరణ్ వుండి... మన 'బంగారు తల్లి' కార్యక్రమం గురించి టీవీ ఛానెల్స్‌లో వచ్చేసివుంటుంది... ఈ పథకం గురించి ప్రజలు ఏమనుకుంటున్నారో, మన గురించి ఎంత గొప్పగా మాట్లాడుకుంటున్నారో తెలుసుకుందాం... ఇలానే వెళితే ప్రజలు మనల్ని గుర్తుపడతారు. కాబట్టి మారువేషాల్లో వెళదాం అని చెప్పాడు. తర్వాత అందరూ పెద్దమ్మతల్లి గుడి ముందు వుండే భిక్షగాళ్ల మాదిరిగా తయారై బయలుదేరారు. అంబర్‌పేటలో ఓ ఇంటి వద్ద ఒకావిడ తన మగబిడ్డను కొడుతూ... ముదనష్టపు నా కొడకా... మగపిల్లాడిగా ఎందుకు పుట్టావురా... ఆడపిల్లగా పుట్టకూడదా... నిన్ను స్కూల్‌కు పంపించాలంటే వేలకువేలు ఫీజులు కట్టాల్సి వస్తుంది. అదే ఆడపిల్లవై వుంటే ఆ ఫీజుల గొడవుండేది కాదు. కిరణ్‌కుమార్‌రెడ్డే చూసుకునేవాడు కదా అని ముక్కు చీదుకుంటూ ఆ పిల్లాడిని మళ్లీ కొట్ట సాగింది. ఈ సీన్ చూసి కిరణ్ మిగతా మంత్రులతో... చూసారా... 'బంగారుతల్లి' ఎంత ప్రభావం చూపుతుందో అని గర్వంగా అన్నాడు. తర్వాత అందరూ దిల్‌సుఖ్‌నగర్ ఏరియాకు వెళ్లాడు. అక్కడ ఒక ఇంటి ముందు ఓ మహిళ శోకండాలు పెడ్తుంది. ఆ కిరణ్ కుమార్‌రెడ్డి నన్ను మోసం చేసాడక్కో... అనే సరికి కిరణ్ నోట్లో పచ్చివెలక్కాయ పడ్డట్టై నోరెళ్లబెట్టాడు. మిగతామంత్రులు కూడా కిరణ్‌వైపు అనుమానంగా చూడసాగారు. అంతలో పక్కింటావిడ వచ్చి... కిరణ్‌కుమార్‌రెడ్డి నిన్ను మోసం చేయడమేంటక్కా... అని అడిగింది. దానికి మొదటి ఆవిడ... ఇద్దరు మగబిడ్డలు పుట్టారక్కా.. అని ఏడుస్తూనే చెప్పింది. ఈ మాటతో కిరణ్‌కు ముచ్చెమటలు పట్టాయి. అప్పుడే దామోదర రాజనరసింహ, బొత్స సత్యనారాయణలు సీక్రెట్‌గా టీవీ ఛానల్స్ వాళ్లకు ఫోన్‌లు చేసి... మీకు హాట్ టాపిక్ దొరికింది. వెంటనే దిల్‌సుఖ్‌నగర్‌కు రమ్మని చెప్పారు. అరనిమిషంలో ప్రత్యక్షప్రసార వ్యాన్‌లతో టీవీల వాళ్లు అక్కడకు చేరుకున్నారు. అప్పటికే పలు టీవీలలో రకరకాల బ్రేకింగ్ న్యూస్‌లు మొదలయ్యాయి. ఏడుస్తున్న ఆవిడను ఓదారుస్తూ పక్కింటావిడ... నీకు ఇద్దరు మగబిడ్డలైతే కిరణ్ కుమార్‌రెడ్డిని తిట్టమెందుకని అడిగింది. అప్పుడామె... ఆడపిల్లలు పుడితే అంతా ఖర్చేనని ఒకటికి రెండు అబార్షన్‌లు చేయించుకుని ఇద్దరు మగబిడ్డలను కన్నాను. కాని ఆ కిరణ్‌కుమార్‌రెడ్డి ఇప్పుడు ఆడపిల్లలకు 'బంగారుతల్లి' పథకం పెట్టి చదువులకు డబ్బులిస్తున్నాడంట... ఈ పథకమేదో నాలుగేళ్లక్రితం పెట్టుంటే ఆడపిల్లల్నే కనేదాన్ని వదినా అంటూ పమిటచెంగుతో కళ్లు ఒత్తుకో సాగింది. అప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి బి.పి. తగ్గి రిలాక్స్ కాగా, దామోదర రాజనరసింహ, బొత్సలు మాత్రం నీరుగారిపోయారు. టీవీల వాళ్లు నిరాశగా వెనుదిరిగారు. కిరణ్ బృందం అక్కడ నుండి అమీర్‌పేటలోకి వెళ్లింది. అక్కడ ఓ స్కానింగ్ సెంటర్ ముందు గర్భిణీస్త్రీలు క్యూ కట్టివున్నారు. కిరణ్ బృందం అక్కడకు వెళ్లి... ఇంతమంది గర్భిణీస్త్రీలు ఎందుకున్నారని ఓ నర్సును అడిగారు. దానికామె... ఇంతకుముందు ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్ చేయించుకునే వాళ్లు. ఆ కిరణ్‌కుమార్‌రెడ్డి బంగారుతల్లి అనే కార్యక్రమం పెట్టాక పరిస్థితి మారిపోయింది. ఇప్పుడు కడుపులో పెరిగే బిడ్డ మగపిల్లవాడైతే అబార్షన్ చేయించుకోవాలనుకుంటున్నారు అని చెప్పింది. ఆ మాటలకు కిరణ్ ముఖం వెయ్యి వోల్టేజీల బల్బులా వెలిగిపోసాగింది. తర్వాత కిరణ్ అటుగా వెళుతున్న ఓ పెద్దాయనను ఆపి... పెద్దాయన మన ముఖ్యమంత్రి 'పుడితే ఆడపిల్లగానే పుట్టాలి... అదీ ఆంధ్రప్రదేశ్‌లోనే' అని చెప్పాడుగా... అదెంతవరకు నిజమంటావ్... అని అడిగాడు. దానికావ్యక్తి... నిజమే నాయనా... "పుట్టినా మగాడిగా పుట్టకూడదు... అదీ ఆంధ్రప్రదేశ్‌లో"... ఈ రాష్ట్రంలో మగాడిగా పుడితే ఒకనాటి కష్టాలు కావు. మగాడి ఆదాయం జానెడు... ఖర్చులు బారెడు. నిత్యావసర వస్తువుల ధరలు చూస్తున్నారుగా... కొనేటట్లున్నాయా? ఓ పక్క ఆ కిరణ్‌కుమార్‌రెడ్డి పన్నులతో చావబాదేస్తున్నాడు. కరెంట్‌ఛార్జీలు, సర్‌ఛార్జీలు పెట్టి ఆస్తులు అమ్ముకునేలా చేస్తున్నాడు. ఆడపిల్లల చదువులకు డబ్బులిస్తాడంట... మరి మగపిల్లల చదువులకు డబ్బులు ఎక్కడ తేవాలి. ఈ రాష్ట్రంలో మగాడిగా పుడితే ఈ కరెంట్ ఛార్జీలు, సర్‌ఛార్జీలు కట్టలేక చావాల్సిందే. కాబట్టి ఆడపిల్లగా పుట్టడమే ఉత్తమం అంటూ ఆ పెద్దాయన వెళ్లిపోయాడు.

వైభవంగా ముగిసిన

## "గీతాజ్ఞాన యజ్ఞం"



చెన్నై యజ్ఞ కమిటీ, అక్షర విద్యాట్రస్ట్ ఆధ్వర్యంలో నెల్లూరుకు చెందిన డా॥యం.మోహన్‌రాజు నేతృత్వంలో నెల్లూరు పురమందిరంలో ఏప్రిల్ నెల 22వతేదీ నుండి 28వతేదీ వరకు పరమ పూజ్య స్వామిని సత్యవ్రతానంద సరస్వతి ప్రవచనాలు ఆదివారంతో వైభవంగా ముగిసాయి. స్వామిని శ్రీమద్భగవద్గీత 7వ అధ్యాయము జ్ఞాన విజ్ఞాన యోగము పై ప్రవచించారు. ఆధ్యాత్మిక చింతన సమాజ శ్రేయస్సుకు దోహదపడుతుందని, ఐహిక సుఖాలను స్వచ్ఛందంగా త్యజించడమే తపస్సని స్వామిని వివరించారు. భగవంతుడు పొందబడే వస్తువు కాదని, మనం భగవత్స్వరూపులమనే ఎరుక కలుగుటమే ఆత్మజ్ఞానమని ఉద్బోధించారు. పంచమ వేదమని కొనియాడుతున్న మహాభారతం మానవ సంబంధాలకు ప్రతీక అన్నారు. ఏడురోజులు జరిగిన ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక చింతనాపరులైన సింహపురీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## దాంపత్య మహాయాగం

### భక్తులకు రామదూత ఆశీస్సులు



యాగంలో ప్రసంగిస్తున్న రామదూతస్వామి

రామదూత సేవాదళం ఆధ్వర్యంలో నెల్లూరు కస్తూరి దేవి గార్డెన్స్‌లో ఆదివారం వేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య మహాయాగం వైభవంగా జరిగింది. వేణుదత్త స్వామి, సువర్ణ లక్ష్మి అమ్మవార్లను విశేషంగా అలంకరించి వేదికపై కొలువుతీర్చారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛరణలతో, మంగళ వాయిద్యాలతో యాగం శాస్త్రోక్తంగా ప్రారంభమైంది. యాగశాలకు విచ్చేసిన రామదూత స్వామికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి భక్తులకు అనుగ్రహభాషణ, సహస్రకుండలి శక్తిదానం, దంపతులకు కంకణధారణ చేశారు. అనంతరం వేదికపై సువర్ణలక్ష్మి, వేణుదత్త స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంకు నగర ప్రముఖులు హాజరయ్యారు.

**13వ మహాయాగం:**

నెల్లూరు జిల్లా కావలికి సమీపంలోని ఆశ్రమంలో మే నెల 13వ తేదీన నిర్వహించనున్న మహాయాగానికి భక్తులు కుటుంబసమేతంగా తరలిరావాలని రామదూత స్వామి పిలుపునిచ్చారు. మహిళలు పసుపు, పురుషులు తెల్లని వస్త్రాలు ధరించి పిల్లలతో కలసి రావాలన్నారు. సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు యాగం జరుగుతుందన్నారు.

## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

శుభకార్య ప్రయత్నాలు, ఉన్నత విద్యా ప్రయత్నాలు అనుకూలిస్తాయి. స్థిరాస్తులు, షేర్ల మీద ఆదాయం ఉంటుంది. క్రొత్త లైసెన్సులు, అనుమతులు పొందడంలో జాప్యం జరుగవచ్చును. అనుకున్న పనులు సమర్ధ వంతంగా పూర్తిచేస్తారు. వృత్తి వ్యాపార పరిశ్రమల యజమానులకు ఆదాయం బాగుంటుంది. పెట్టుబడులకు, వ్యాపారవృద్ధికి ప్రయత్నాలు కలిసి వస్తాయి.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

శుభకార్య ప్రయత్నాలు, ఉన్నత విద్యావకాశాలు దొరకడం ఉంటుంది. క్రొత్త పెట్టుబడులకు అవకాశాలు ఆహ్వానాలుంటాయి. సాంఘిక సేవాకార్యములలో పాల్గొం టారు. ఆత్మీయులను, బంధుమిత్రులను కలుసుకొంటారు. వ్యాపారాభివృద్ధికి పథకాలు ప్రణాళికలు వల్ల ఆదాయం పెరుగుతుంది. వృత్తిపరంగా రాబడి గుర్తింపు ఉంటుంది. వారంలో మధ్యలో కొంత అదనపు ఖర్చులుంటాయి.


## మిథునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

వివాదస్పద విషయాలలోను, హామీలు విషయం లోను, జాగ్రత్తగా వ్యవహరించండి. విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి పెట్టగలరు. వృత్తిపరంగా గౌరవాదాయాలు బాగుంటాయి. భాగస్వామిక, సొంత వ్యాపారాలు బాగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. పారిశ్రామికవేత్త లకు, వ్యవసాయదారులకు ప్రోత్సాహకాలు బాగుంటాయి. షేర్లు, స్థిరాస్తుల మీద ఆదాయం పెరుగుతుంది.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులు అధికారవర్గం వల్ల ఒత్తిడి ఎదుర్కొన వలసి రావచ్చును. షేర్లు పెట్టుబడులు స్థిరాస్తులపై లాభా లుంటాయి. ప్రభుత్వ అనుమతులలో ఆలస్యంకావచ్చును. వృత్తి జీవనము కలిగిన వారికి ప్రతిఫలం బాగుంటుంది. వ్యాపార వర్గాల వారు అమలుచేసిన పథకాలు మంచి ఫలితాలను, ఆదాయమును ఇస్తుంది. కుటుంబ వ్యవహారాలు కొద్దిగా ఇబ్బంది కలిగిస్తాయి.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

వృత్తి వ్యాపారాలలో ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. దూరప్రయాణాలుంటాయి. అనుకోని అదనపు ఖర్చులు కొద్దిగా ఉంటాయి. ఓర్పు పట్టుదలతో అనుకున్న పనులు సాధించుకుంటారు. వ్యాపారులు ఉద్యోగులకు అధికారుల వల్ల ఇబ్బందులుంటాయి. సోదరులతోగాని బంధువర్గంతో గాని మాటపట్టింపులు రావచ్చును. కోర్టు నోటీసులు వంటి సంజాయిషీలు ఇచ్చుకొనవలసి వస్తుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఖర్చులు కొంత ఎక్కువగా ఉన్నా ఆర్థిక ఇబ్బందులు బాధించవు. స్థిరాస్తులు షేర్లపై ఆదాయం బాగుంటుంది. దూరప్రయాణాలు ఏర్పడవచ్చును. వ్యాపారవర్గాలకు అంచనాలకు తగ్గ రాబడి ఉండదు. కోర్టు వ్యవహారాలలో అనుకూలత తక్కువ. ఋణాలు, చేబదుళ్ళు ఇవ్వవద్దు. క్రొత్త పెట్టుబడులు, వ్యాపారభాగస్వామ్య ఆలోచనలు తాత్కాలికంగా విరమించండి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 3.5.2013 నుండి
తేది. 9.5.2013 వరకు

ఈ వారము కుంభమీనమేషరాశులలో చంద్రుడు, మేషంలో రవికుజబుధకేతుశుక్రులు, 4వతేది నుండి వృషభంలో శుక్రుడు, వృషభంలో గురువు, తులలో శనిరాహువులు సంచరిస్తారు.

### పంచాంగము :


తేది 4 శనివారం నుండి డొల్లుకర్తరి ప్రారంభము.

ముహూర్తములు లేవు.

### చైత్రమాస కృష్ణ పక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 3 | శుక్ర | అష్టమి | ఉ॥గం.8.04ని॥ |
| తేది. 4 | శని | నవమి | ఉ॥ గం.6.17ని॥ |
| | పిదప | దశమి | రా॥ గం.4.45ని॥ |
| తేది. 5 | ఆది | ఏకాదశి | రా॥ గం.3.44ని॥ |
| తేది. 6 | సోమ | ద్వాదశి | రా॥ గం.3.15ని॥ |
| తేది. 7 | మంగళ | త్రయోదశి | రా॥ గం. 3.10ని॥ |
| తేది. 8 | బుధ | చతుర్దశి | రా॥గం.3.42ని॥ |
| తేది. 9 | గురు | అమావాస్య | రా॥గం. 4.38ని॥ |


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆరోగ్యం సహకరించదు. బాకీదారుల వత్తిడి మీపై ఉండవచ్చును. ఉద్యోగులు తమ పనులందు జాగ్రత్త పడాలి. అనవసర గొడవలు రాకుండా చూచుకొనాలి. కొత్త వ్యాపారాలు, పెట్టుబడులకు తొందరపడకుండా కొంత కాలం ఆగటం మంచిది. ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు సంతృప్తినిస్తాయి. చేపట్టిన పనికి ఆటంకాలున్నను పట్టువదలవద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

అనుకోని ప్రయాణాలుంటాయి. అనవసర వ్యవహారాల వల్ల అవమానాలు ఎదుర్కోవలసిరావచ్చును. అనుకున్న పనులు బాగా టెన్షన్ పెడతాయి. ఖర్చులు, చెల్లింపులలో జాగ్రత్తగా మెలగండి. వ్యవసాయదారులు పారిశ్రామిక యాజమాన్యులకు ఆర్థికస్థితి బాగుంటుంది. అనవసర ఖర్చులు పైనబడిపోతాయి. సేవా, యూనియన్ కార్యక్రమాలలో పాల్గొంటారు.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వ్యాపారులకు ఉద్యోగులకు అధికారుల వత్తిడి పెరుగుతుంది. చిన్నవృత్తులు, చిన్న వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులు ధైర్యంగా చేస్తారు. ప్రయోజనం పొందుతారు. ఏదో ఒక రూపంలో ఎక్కువగా అదనపు ఖర్చులుంటాయి. తండ్రివర్గ బంధువులొకరికి అనారోగ్య బాధలుంటాయి. మీ నుండి విషయ సేకరణకై ఇతరులు ప్రయత్నిస్తారు.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

క్రొత్త వస్తువులు, గృహోపకరణాలు ఏర్పరచు కొంటారు. ఉద్యోగులు సహచరులతోను, అధికారుల తోను జాగ్రత్తగా మెలగాలి. నిరుద్యోగులు వ్రాత మౌఖిక పరీక్షలలో రాణిస్తారు. ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. అవసరాలకు ఖర్చులకు డబ్బును ఏదో ఒకవిధంగా సర్దుబాటు చేస్తుంటారు. వ్యాపారవృద్ధి ప్రయత్నాలు మంద కొడిగా సాగుతాయి. అవసరంగా ప్రయాణాలుంటాయి.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వ్యాపారులకు, ఉద్యోగులకు ఉన్నతాధికారుల వల్ల బెడద ఉంటుంది. యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. దీర్ఘకాలిక పెట్టుబడులకు, వ్యాపార భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి. కుటుంబసభ్యులొకరికి అనారోగ్య బాధ ఉంటుంది. సొంత వృత్తులు, వ్యాపారాలలో ఆదాయం పెరుగుతుంది. ముఖ్య పనులకు బంధువులు, ఆత్మీయుల సహకారం లభిస్తుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

దూరమైన బంధువులు మరల దగ్గరకు చేరతారు. షేర్లు, పెట్టుబడుల స్థిరాస్తులపై ఆదాయం లభిస్తుంది. ఉన్నత విద్యావకాశాలు, ప్రభుత్వపరంగా లైసెన్సులు అనుమతులు దొరుకుతాయి. వస్తువులు వసతులు సమకూర్చుకొంటారు. వృత్తులు నిర్వహించేవారు వ్యాపారులకు ఆదాయం పెరుగుతుంది. శుభకార్య ప్రయత్నాలు, ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది.

## అశ్లీల నృత్యాలపై
# పోలీసుల కన్నెర్ర

నెల్లూరుజిల్లా చిల్లకూరు మండలం బల్లవోలు గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా ఇటీవల అర్ధరాత్రి అశ్లీల నృత్యాలను ప్రదర్శిస్తున్న డ్యాన్సర్లను పోలీసులు అరెస్ట్ చేసి ఐదవ నగర పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆదివారం జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ విలేకర్లతో మాట్లాడుతూ బల్లవోలుకు చెందిన చాకిరి యశ్వంత్‌తో నెల్లూరు సంతపేటకు చెందిన సూపర్‌డూపర్ డ్యాన్స్ అకాడమి యజమాని బాబుతో ఒప్పందం కుదుర్చుకున్నాడని, బాబు తీసుకొచ్చిన బృందంలోని డ్యాన్సర్లు అశ్లీల నృత్యాలు ప్రదర్శిస్తుండగా సమాచారం అందుకుని గూడూరు రూరల్ సిఐ వేమారెడ్డి, చిల్లకూరు ఎస్సై దశరథరామయ్యలు అశ్లీలనృత్యాలు ప్రదర్శించే డ్యాన్సరులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

**అటెన్షన్ ప్లీజ్....**

పొట్టకూటి కోసం, సంసారం సాగేందుకు అప్పుడప్పుడు వచ్చే ఉత్సవాల్లో నృత్యాలు చేసుకుంటూ జీవనోపాధి సాగించే పేద కళాకారులను అశ్లీల నృత్యాల పేరిట అరెస్టులు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్న పోలీసులు నగరంలో పెద్దపెద్ద మైదానాల్లో నగర ప్రముఖులను రాజకీయ నాయకులను పోలీసు అధికారులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి మెగా ఈవెంట్ పేరుతో జూనియర్ ఆర్టిస్టుల చేత అసభ్యకరంగా, అర్ధనగ్నంగా నృత్యాలు నిర్వహిస్తున్నపుడు ఇలాంటి అరెస్టులు చేయడంలేదు ఎందుకబ్బా, అంటూ జనం చెవులు కొరుక్కుంటున్నారు.

## హామీలకు కార్యరూపం

నెల్లూరు జిల్లా కలెక్టరు కార్యాలయంలో గతనెల 30న 12మంది గిరిజన విద్యార్థులకు కలెక్టర్ బి.శ్రీధర్ సైకిళ్ళు, క్రీడాసామాగ్రి పంపిణీ చేశారు. ఇందిరమ్మ కలలు, ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌ల అమలులో భాగంగా జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఇటీవల వింజమూరు మండలం ఇందిరానగర్ గిరిజనకాలనీని సందర్శించి గిరిజనపిల్లలతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ కాలనీలోని పాఠశాలలో 5వతరగతి వరకే వుందని, పై తరగతులకు వెళ్ళి చదవడానికి రెండు కిలోమీటర్లు దూరం వెళ్ళాల్సి వస్తుందని వారు తెలపడంతో కలెక్టర్ స్పందించి ఆ 12మంది పిల్లలకు సైకిళ్ళను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెం మండలం, మంగలకట్ట గిరిజన కాలనీవాసులైన 170మంది యానాదులకు 35కేజీల చొప్పున బియ్యాన్ని, ఇళ్ళస్థలాలను మంజూరు చేయడంతో వారు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీడిఏ పిఓ వై.వెంకటేశ్వర్లు, ఐడీసీ సిఇఓ వీరభద్రయ్య, హౌసింగ్ పిడి వెంకటేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా

## "దేవరాల"

బీసీ సంక్షేమ సంఘం జిల్లా అడ్‌హాక్ కమిటీ అధ్యక్షుడిగా దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్‌ను నియమిస్తూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల హైదరాబాదులోని బీసీ భవన్‌లో సుబ్రహ్మణ్యంకు కృష్ణయ్య నియామక ఉత్తర్వులను అందజేసారు.

ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమసంఘం మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పద్మజా యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా నాయకులు పి.పెనుకొండయ్య, యు.గోవిందరావు, జి.కృష్ణయ్య, డి.వెంకట్రావు, పద్మావతి, శంకరయ్య, నారాయణ, శ్రీనివాసులు, నాగరాజు పాల్గొన్నారు.




## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1983 నవంబరు 7 జననం. ఎత్తు 5'10". చదువు బి.టెక్(కంప్యూటర్స్). ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(విప్రో) హైదరాబాద్. జీతం నెలకు రూ.1లక్ష. ఆస్థివిలువ రూ.4 1/2కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
2. 1983 సెప్టెంబరు 16 జననం. ఎత్తు 6'. చదువు బి.ఇ(కంప్యూటర్స్). ఉద్యోగం సీనియర్ అసోసియేట్, కంపెని-సి.టి.యస్. జీతం నెలకు రూ.70,000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్తివాటా రూ.4కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం మద్రాసు.
3. 1988 అక్టోబరు 15జననం. ఎత్తు 6'1". చదువు బి.యస్.సి.(కంప్యూటర్స్) ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్తి వాటా 100కోట్లు. స్వస్థలం అనంతపూర్ జిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
4. 1984 జనవరి 1 జననం. ఎత్తు 6'1". చదువు బి.ఇ. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. కంపెని ఒరాకిల్(బెంగుళూరు). జీతం నెలకు రూ.50,000/-. ఆస్థి విలువ 5కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుత నివాసం బెంగుళూరు.
5. 1981 మార్చి 5 జననం. ఎత్తు 5'11". చదువు బి.యస్.సి., యం.సి.ఎ. ఉద్యోగం పి.సి.యల్ టెక్నాలజీస్. జీతం రూ.70,000/-. ఆస్థి విలువ రూ.15కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం అనంతపూర్‌జిల్లా. ప్రస్తుత నివాసం బెంగుళూరు.



### వరుడు కావలెను

6. 1983 జూన్ 27 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్(ఐ.ఐ.టి). సీనియర్ ప్రోగ్రాం అనలిస్ట్ - శాప్ (రాక్‌వెల్ కొల్లిన్స్) హైదరాబాద్. జీతం నెలకు రూ.1లక్షా16,000/-. హైదరాబాద్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థివాటా రూ.1 కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
7. 1988 మే నెల 22 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్ (బయో ఇన్ఫర్‌మాటిక్స్). ఉద్యోగం టి.సి.యస్. జీతం నెలకు రూ.30,000/-. ఆస్థి విలువ రూ.1కోటి. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం కర్నూలుజిల్లా.
8. 1985 మార్చి నెల 2 జననం. ఎత్తు 5'3". చదువు యం.బి.బి.యస్(చెన్నై). యం.డి (రేడియాలజి) మొదటి సంవత్సరం. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థి విలువ 15కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం కోలార్‌జిల్లా.
9. 1986 డిసెంబరు 1 జననం. ఎత్తు 5'10 1/2". చదువు బి.డి.యస్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థి విలువ 4కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
10. 1986 ఆగష్టు 30 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్(కుప్పం). జనరల్ మెడిసిన్ (3వ సంవత్సరం) దావణగెరె (కర్నాటక). ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థి విలువ రూ.5కోట్లు. స్వస్థలం కర్నూలుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413. పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.

98480 34522
94406 39460.

పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# చీకట్లో రాజరాజేశ్వరి

**➤ గాడితప్పిన పాలన ➤ ఆవేదనతో భక్తులు**



నిత్య ధూపదీప నైవేద్యాలతో అనునిత్యం విరజిల్లాల్సిన అమ్మవారు విద్యుత్‌లేని సమయంలో జనరేటర్‌కు డీజిల్ పట్టించేందుకు డబ్బులేక చీకట్లో భక్తులకు దర్శనమిస్తోంది. ఆలయ సహాయ కమీషనర్, కార్యనిర్వహణాధికారి గతకొద్ది రోజులుగా ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ను స్విచ్ ఆఫ్ చేసి ఉండడంతో ఆయన పాలన గాడితప్పింది. వివరాలలోకెళితే నెల్లూరు దర్గామిట్టలో వేంచేసియున్న భక్తుల కొంగుబంగారం శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఆలయ పూజారులకు నిత్యధూపదీపనైవేద్యాలకు నిధులులేక విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు జనరేటర్‌కు డీజిల్ పట్టించుకునేందుకు డబ్బుల్లేక చీకట్లో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ సహాయ, కమీషనర్, కార్యనిర్వహణాధికారి గత 10రోజులుగా కనుమరుగయ్యారు. సెలవు మీద వెళ్ళి వుంటే ఇన్‌చార్జిగా తన బాధ్యతలను మరొకరికి అప్పగించి వెళ్ళాల్సి వుంది. ప్రభుత్వం కేటాయించిన సెల్‌ఫోన్‌ను ఎల్లప్పుడూ అందుబాటులో వుంచుకోవాలి. కాని సెల్‌ఫోన్ స్విచ్‌ఆఫ్ అనే సంకేతం వినవస్తోంది. ఆలయ ఈఓ సెలవు వెనుక ఏదైనా వివాదం దాగుందా అంతు పట్టడంలేదు. కారణాలు తెలియరావడంలేదు. ఏది ఏమైనా ఎంతో పేరు ప్రఖ్యాతలు గల అమ్మవారి దేవస్థానంలో సరైన నిర్వహణ కరువై భక్తులు అమ్మవారి దర్శనాన్ని చీకట్లో దర్శించుకోవాల్సిన పరిస్థితి ఎదురైందని భక్తులు ఆవేదన చెందుతున్నారు.

# వాకర్స్‌చే పిల్లలకు పౌష్టికాహార పంపిణీ



కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న వాకర్స్

నెల్లూరు దర్గామిట్ట ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మే 1న పిల్లలకు ఉడికించిన కోడిగ్రుడ్లు, కేక్స్ జిల్లా అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి పంపిణీచేసారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్రశెట్టి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో క్రీడాశిక్షణకు వస్తున్న 600 మంది చిన్నారులకు వాకర్స్ సహకారంతో మే 1నుండి 31వతేదీ వరకు ప్రతి రోజూ పౌష్టికాహారాన్ని అందజేస్తామన్నారు. గత 5ఏళ్ళుగా ప్రతి వేసవిలో ఇలా చేస్తున్నామన్నారు. మొదటిరోజు వాకర్సు బి.సుందర రామిరెడ్డి, ఎ.రామచంద్రారెడ్డిల సహకారంతో కోడిగ్రుడ్లు, కేక్స్ అందించామన్నారు. కార్యక్రమంలో డి.ఎస్.డి.ఓ ఎతిరాజు, రూరల్ డిఎస్పీ బాలవెంకటేశ్వరరావు, వాకర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎన్.బలరామయ్యనాయుడు, కోశాధికారి స్వర్ణరమేష్‌బాబు, వి.హజరత్‌బాబు, అంకిరెడ్డి, దొరస్వామినాయుడు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# 'మే'మాస మీమాంశ సారాంశం

అలనాడు అమెరికాలోని 'చికాగో' నగరంలో, శ్రామిక జనం యాజమాన్యమిచ్చే దాలి. చాలని బిల్లరమాన్యంతో వారి చాకిరికి. సరిపడా విత్తం ఇవ్వడానికి. పరిశ్రమాధినేతల చిత్తం చలించక, చివరికి చిరాకెత్తి, ఛీకాకులతో, వారి చెమట నుండి 1886లో పుట్టిన కార్మిక, శ్రామికజన విప్లవమే మేడే. అమెరికా, కెనడా దేశాలు దక్క ప్రపంచదేశాలన్నీ ఆనాడు వారు విసిగెత్తి విప్లవ విజయులైన రోజును స్మరించుకుంటూన్నాయి మొన్నటి రోజును 'మేడే' పేరిట.

కష్టపడి సంపాదించుకునే వారంతా శ్రమజీవులే. వారు, రజకులైనా, క్షురకులైన, వండ్రంగులైనా, రైతులైనా, డాక్టర్లయినా, ఇంజనీర్లయినా, న్యాయవాదులైనా, మీడియా వారైనా కడకు చెప్పులు కుట్టుకుని జీవించేవారైనా పోలీసు, మిలటరీ సిపాయిల్లాంటి ప్రభుత్వ ఉద్యోగులైనా వారికీ వర్తిస్తుంది 'శ్రమ పదం'.

కాని 'ఆ పదానికి' విరుద్ధంగా, చిరుద్యోగులైనా అడ్డదారుల్లో, అత్యాశతో ప్రజల్ని పీడించి కోట్లకు కోట్లు హద్దు మీరిపోయి సంపాదించేవారు, మాత్రం మన దేశసరిహద్దులు దాటి వచ్చి దహనకాండకు కారకులవుతున్న దేశద్రోహులతో సమానులే. ద్రవ్యోల్బణానికి. ఇన్‌ఫ్లేషన్‌కి తద్వారా మధ్యతరగతి వారు అనుభవిస్తున్న అలమటింపులకు కారణభూతులు వీరే. కానీ ప్రజల నొప్పించక పనిచేసి పీడించక, ప్రతి నొసంగిన సైకం పుచ్చుకునే వారు మాత్రం పవతులు, పాతకులు కారు, పావనులే, పవిత్రులే. ఇది వర్తమానంలో వర్తింపచేనా స్వాభిప్రాయం. ఔర అగున నామాట నీటిమూట. అందునా అట్టి చెడుచిత్తుల విత్తం శాశ్వతంగాదు. ఏదో ఒకరోజు ఏదో ఒకరూపంలోపోతుంది. సైకంతో పాటు, పరువు, పొగరు కూడా. ఉదాహరణకి... ఏసిబి = ఏదో ఒక, సిబి అనగా న్యాయపరమైన తక్కెడలోని పాత్ర, అని అర్థం. అట్టి పాత్రదారుపాత్రకు(ప్రజల ఉసురు తగిలి) పాపం పండుతుంది. ఇది నిజం: ప్రకృతి నైజం.

ఇకపోతే. 6.8.10.14గం॥ల తరబడి కరెంటు కోతకు తోడు రాళ్ళు కరిగే రోహిణికార్తె రాకముందే అల్లాడిస్తున్న సూర్యకిరణాల మూలాన, తటాకాలు, దొరువులు, చెరువులు సైతం ఎండిపోయి నీటి కొరత కూడా తోడై, శిశువుల మొదలు పశువుల నుండి కోట్లాది తెనుగు ప్రజానీకం దుర్భరస్థితిలో వున్నారు. తేట తెలుగు కూడా తెలియని తెనుంగు నేలాధిపతి ముందు జాగ్రత్తలేవీ కార్యరూపంలో అనుసరించకపోయినా, రోజుకో పూటైనా స్నానానిక్కూడా గతిలేని ఈ దుస్థితిలో, కనీసం చెమటతోనైనా మూడు పూటలా స్నానం చేయడానికి అవకాశం కల్పించినందుకు నా మనఃపూర్వక అభినందనలు. కనుక ప్రస్తుతం అందరం శ్రామికులమే.

చిరజీవుడైన జగన్నాధుడు అవతరించే వరకు ఆంధ్రులకు అంధకారం, అతలాకుతల బ్రతుకు అంతంకాబోదు. అది అంతమయ్యే సమయం త్వరలోనే ఆసన్నం కానున్నదని నా సిక్స్‌సెన్సుకు తెల్సు. ఒక్క మాటలో చెప్పాలంటే పరమాత్మ స్వరూపులుగా చెప్పబడే పసిబిడ్డలు కూడా ఫంకా లేనిదే నిద్రపట్టదు. దాని మూలంగా రాత్రంతా పల్లెల్లో, తల్లిదండ్రులు తల్లడిల్లుతున్న దుర్ఘటనల్లాంటివి (ఎల్లలులేని కొల్లలు) అంతంగా కాబోతున్నది, ఆ గతి జగతీసుని ద్వారానే సాధ్యం.

డా॥ పెళ్లకూరు జె.పి.రెడ్డి, M.B.B.S FSI FIC(USA)
చర్మ & సౌలి సెక్సాలజిస్ట్
నెల్లూరు. 0861-2333666.

# వై.యస్. పాలన స్వర్ణయుగం

**- కాకాణి, కొమ్మి**



వెంకటాచలం మండలం చౌటపాలెంలో ఏప్రిల్ 30న వైయస్సార్‌సీపీ సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వెంకటగిరి సమన్వయకర్త కొమ్మి లక్ష్మయ్యనాయుడులు దీవెన యాత్రలో పాల్గొని వైయస్సార్‌సీపీ విధి విధానాలను వివరించారు. సర్వేపల్లి నియోజకవర్గ కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలను చిత్తశుద్ధితో సజావుగా అమలు చేసింది. ఎన్టీఆర్, వైయస్సార్‌లేనని అందుకే వాళ్ళిద్దరూ ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసారని అన్నారు. పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు నేటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బంగారుతల్లి, అమ్మహస్తం అంటూ నిష్ప్రయోజనమైన సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని అన్నారు. పేరుకే తప్ప ప్రజలకు అవి ఏ మేలూ చేయవని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ స్టీరింగ్ కమిటీ సభ్యులు బి.శ్రీకాంత్ రెడ్డి, పి.శ్యాంప్రసాద్‌రెడ్డి, మండల కన్వీనర్ కె.చెంచుకృష్ణయ్య నాయుడు, నాయకులు వాకాటి శ్రీనివాసులురెడ్డి, మద్దిరెడ్డి రమణారెడ్డి, వల్లూరు శ్రీనివాసులునాయుడు, ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, సుమంత్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

# డిఎన్‌బిలో నెల్లూరు విద్యార్థి ప్రతిభ



2012లో ఎన్‌బిఇ వారిచే నిర్వహించబడిన పి.జి మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో నెల్లూరు వాసి అయిన తాడేపల్లి నాగ శ్రీవిద్య డిఎన్‌బిలో ఆల్‌ఇండియాలో రెండవర్యాంక్ సాధించారు. ఎంబిబిఎస్ ఎంట్రన్స్‌లో 283 ర్యాంకు సాధించి కర్నూలు మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ పూర్తి చేసింది. ఆమె తండ్రి నెల్‌క్యాస్ట్ లిమిటెడ్, గూడూరులో హెచ్‌ఆర్‌ఎజిఎమ్‌గా పని చేస్తున్నారు. నెల్లూరు ఖ్యాతిని నిల బెట్టిన శ్రీవిద్యకు 'లాయర్' అభినందనలు.

## విశ్వసాయి కళాశాలకు రాష్ట్రస్థాయి ర్యాంకులు



గౌతమ్



శ్రీకావ్య

నెల్లూరు మాగుంటలేఅవుట్ అన్నమయ్య సర్కిల్ వద్దనున్న విశ్వసాయి జూనియర్ కళాశాల విద్యార్థినులు సీనియర్ ఇంటర్ బైపీసీ విభాగంలో రాష్ట్రస్థాయి 2, 6వస్థానాలు సాధించినట్లు కళాశాల ఛైర్మన్ డా॥ఎస్.సత్యనారాయణ అన్నారు. సోమవారం కళాశాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందించి మాట్లాడుతూ కళాశాల విద్యార్థిని ఏ.కావ్య 988మార్కులతో రాష్ట్రస్థాయి రెండవర్యాంకు ఏఎస్‌ఏ నివాళిక 984మార్కులతో 6వర్యాంకు సాధించారన్నారు. ఎంపీసీ విభాగంలో కె.గౌతంరెడ్డి 983, ఆర్.ఎస్.నిషాంత్ 979 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఛైర్మెన్ జి.కృష్ణమోహన్, జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ ప్రిన్సిపల్స్ జితేంద్ర, శ్రీరాములురెడ్డి పాల్గొన్నారు.

**వైభవంగా ముగిసిన**

# శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



నెల్లూరునగరం మూలాపేటలో వేంచేసియున్న శ్రీ రుక్మిణీసత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి దేవస్థానంలో శ్రీ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు గత నెల 20వ తేదీ నుండి ప్రారంభమై మంగళవారంతో వైభవంగా ముగిసాయి. 20వ తేదీ అంకురార్పణ, 21వతేదీ శేష వాహనం, 22వ తేదీ హంసవాహనం, 23వ తేదీ చంద్రప్రభ, 24వ తేదీ వెండి హనుమంతసేవ, 25వ తేదీ గరుడసేవ, 26వ తేదీ కల్యాణం, గజ వాహనం, 27వ తేదీ రథోత్సవం, పుష్పకవిమాన అలంకారం, 28వతేదీ అశ్వవాహనం, 29వతేదీ పొన్నవాహనం, 30వతేదీ ఏకాంతసేవ, ధ్వజావరోహణం తదితర కార్యక్రమాలు కనులవిందుగా జరిగాయి. ఆలయ ప్రధానార్చకులు సంపత్‌కుమార్ ఆచారి, అర్చకుల బృందం ప్రతిరోజు శ్రీస్వామివారికి విశేషపూజలు, అభిషేకాలు తదితర కార్యక్రమాలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ ఉత్సవాల సందర్భంగా కోలాటాలు, చెక్కభజనలు, తెనాలి మ్యూజికల్ బ్యాండుమేళం, కీలుగుర్రాలు తదితర కార్యక్రమాలను నేత్రపర్వంగా నిర్వహించారు. ప్రతిరోజూ సాయంత్రం లలితా ఉపాసకులు డా॥ మైలవరపు శ్రీనివాసరావుచే సుందర కాండ సప్తాహము, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలను ఆలయ ట్రస్టీలు మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుబ్బారెడ్డి, మేనేజర్ కృష్ణ, సిబ్బంది పర్యవేక్షించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని విశేషపూజలు నిర్వహించారు.

# ఘనంగా మేడే రెపరెపలు

**పుచ్చలపల్లి సుందరయ్య జయంతి ఉత్సవాలు**




ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను గురువారం నెల్లూరులో కార్మికులు ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా ఎర్ర జెండాలతో రెపరెపలాడాయి. పుచ్చలపల్లి సుందరయ్య 101జయంతి ఉత్సవాలను కార్మిక సోదరులు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా మజ్జిగ చలివేంద్రాలను ఏర్పాటు చేసారు. ముత్తుకూరుగేటు సెంటర్‌లో సిఐటీయు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రాలను సిపియం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జక్కా వెంకయ్య ప్రారంభించారు. 15వ డివిజన్ చిల్డ్రన్స్‌పార్కు ప్రాంతంలో స్థానిక సిపియం నేత శ్రీనివాసులు ఆధ్వర్యంలో సుందరయ్య మాస్కులు ధరించి కార్యకర్తలు వినూత్న ప్రదర్శన చేసారు. కనకమహల్ సెంటర్ వద్ద ఉన్న సుందరయ్య విగ్రహానికి డివైఎఫ్ఐ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సండే మార్కెట్ వద్ద ఏఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో నూతనంగా ఎర్రజెండాను ఎగురవేశారు. టెక్కేమిట్టలో పోలూరు సుబ్బరామయ్య జ్ఞాపకార్థం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. విఆర్‌సి సెంటర్ వద్ద ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో జెండాను ఎగుర వేసారు. మినీబైపాస్ రోడ్డులోని భవన నిర్మాణ సంఘం జిల్లా కార్యాలయంలో ఎర్రజెండాను ఎగురవేశారు. రేబాలవారివీధిలోని యలమందారెడ్డి భవన్‌లో, ఆజాద్ సెంటర్‌లో ఏఐటీయుసి ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. దర్గామిట్టలోని భారతీయ జీవితభీమా సంస్థ నెల్లూరు డివిజన్ కార్యాలయంలో మేడేను ఘనంగా నిర్వహించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద జిల్లా లారీవర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని అన్ని సబ్‌స్టేషన్ల ఆవరణాలలో మేడే వేడుకలను నిర్వహించి యూనియన్ పతాకాలను ఎగురవేశారు. అర్బన్ బ్యాంకు ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు గాంధీనగర్‌లోని వారి బ్యాంకు వద్ద జెండాను ఎగురవేసి మేడేను ఘనంగా జరుపుకున్నారు.

PDF Compressor Free Version





# గూడూరు డివిజన్ వార్తలు

## ఉన్నతలక్ష్యంతో ముందుకుసాగాలి

విద్యార్థులు చిన్ననాటి నుంచే ఉన్నతలక్ష్యాలను ఏర్పరుచుకొని ముందుకు సాగాలని సబ్‌కలెక్టర్ నివాస్ అన్నారు. సింహపురి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్వీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో విద్యార్థులకు పోటీపరీక్షలపై గతనెల 27న అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తమకంటూ లక్ష్యాలను ఏర్పరుచుకొని క్రమశిక్షణతో ప్రయత్నిస్తే విజయం సాధించవచ్చన్నారు. సివిల్స్‌కు సిద్ధమయ్యే వారు పాత ప్రశ్నాపత్రాలను బాగా చదవాలని సూచించారు. అలాగే సీనియర్లు, ఐఏఎస్‌లుగా ఎంపికైన వారి సలహాలను తీసుకుంటే ఉపయోగపడుతాయన్నారు. మారుమూల గ్రామం నుంచి సివిల్స్ టాపర్‌గా నిలిచిన ముత్యాల రాజును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన అభినందించారు. అనంతరం ఐఎఫ్ఎస్ శ్రీనివాసులురెడ్డి, నెల్లూరు సీటీఓ తులసీలు మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాదని, ఏకాగ్రతతో కృషిచేస్తే లక్ష్యాలను అందుకో వచ్చన్నారు. అనంతరం కృష్ణపట్నం డిప్యూటీ కమీషనర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ యువత చెడుమార్గాల వైపు కాకుండా ఉన్నతస్థానాలను సాధించే దిశగా ప్రయత్నాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఆర్ రెడ్డి, అసోసియేషన్ సభ్యులు గుడిమిట్ట ఉదయ్‌కుమార్, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## కాకాణికి ఘనస్వాగతం

వైయస్సార్సీపీ సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త, కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డికి గూడూరు మండలంలోని నెల్లటూరు, చెన్నూరు తదితర గ్రామాల ప్రజలు ఇటీవల ఘనస్వాగతం పలికారు. బాలాయపల్లి మండలం జయంపులో కాంగ్రెస్ నాయకుడు భాస్కర్‌రెడ్డి వైయస్సార్సీపీలో చేరనున్న నేపథ్యంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, కొమ్మి లక్ష్మయ్యనాయుడు, పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి తదితరులు నెల్లూరు నుంచి జయంపు బయల్దేరి వెళ్లారు. ఈమేరకు గూడూరు రూరల్ మండలం నెల్లటూరు వద్ద నెలబల్లి భాస్కర్‌రెడ్డి, చెన్నూరులో ముప్పాళ్ల చంద్రమోహన్‌రెడ్డి, కొండూరు సునీల్‌రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్యకర్తలు పూలతో స్వాగతం పలికారు.


## డీఎస్పీగా చౌడేశ్వరి



గూడూరు డీఎస్పీగా కందుల చౌడేశ్వరిని నియమించారు. ఇప్పటివరకు పని చేసిన టీ.హనుమంతరావును హైదరాబాద్‌కు బదిలీచేసి అక్కడ రిపోర్ట్ చేయమని ఆదేశాలు జారీచేసారు. గుంటూరుజిల్లా తక్కెళ్లపాడు గ్రామానికి చెందిన చౌడేశ్వరి చిన్నకారు రైతు కుటుంబంలో జన్మించారు. 2010లో ఏపీపీఎస్సీ పరీక్ష ద్వారా డీఎస్పీగా ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. తొలుత రంగారెడ్డి జిల్లా వికారాబాద్ డీఎస్పీగా 2011 నుండి 2013 జనవరి వరకు పనిచేశారు. నేరాలను నియంత్రించడంలో సామర్థ్యం చూపించారు. గ్రేహౌండ్స్ డీఎస్పీగా పనిచేస్తూ ఆమె గూడూరుకు బదిలీ అయ్యారు.

## చెన్నకేశవస్వామి ఆలయంలో అన్నదానం

గూడూరు పట్టణంలోని కరణాల వీధిలో వున్న శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో గత నెల 27న అన్నదానం నిర్వహించారు. అన్నదాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదానం ప్రారంభించి సంవత్సరం పూర్తయిందన్నారు. అన్నదానానికి సహకరించే దాతలు ఆలయంలో సంప్రదించాలని కోరారు.



## 'గ్రీకువీరుడు' 53

'గ్రీకువీరుడు' సినిమాలో నాగార్జున దమ్మనీగార్డ్‌తో కలిసి పనిచేశారు. షూటింగ్ అయ్యాక వారు నాగార్జున వయసు 53 అని తెలుసుకుని ఆశ్చర్యపోయి నాగార్జునతో మీ వయస్సు 30 అనుకున్నాం, కానీ మీ వయస్సు చాలా ఎక్కువే అని ఆశ్చర్యపోయారట!








## సుడి తిరిగింది

12ఫ్లాపుల తర్వాత నితిన్‌కు 'గుండెజారి గల్లంతయ్యిందే'తో హిట్ వచ్చింది. దీంతో ఆయన సుడి తిరిగి మళ్లీ కాల్షీట్స్ కోసం డిమాండ్ వచ్చింది.




తాను ముందు నటించిన సినిమాల్లో పెద్దగా గుర్తింపు రాకపోవడంతో 'రయ్‌రయ్' సినిమాలో హాట్‌గా కనిపించినా అక్షకు ఫలితం దక్కలేదు!

## నిరాశే మిగిలింది

## చిన్నగౌను వేసుకున్న పెద్దపాప

క్రీడాకారిణి గుత్తా జ్వాలా వివిధ ప్రోగ్రాములకు పొట్టి దుస్తులతో హాజరవుతుంది. ఇలా తిరుగుతుంటే మహిళలపై దాడులు జరగకుండా ఉంటాయా అని మహిళలే వ్యాఖ్యానించుకోవడం విశేషం!


పితృదేవోభవ



సంఘసేవకులు, ప్రజాసేవకులు

స్వర్గీయ తిక్కవరపు బాబురెడ్డి గారు

నిర్యాణం 4 మే 1992

21వ వర్ధంతి (04.05.13) సందర్భంగా

వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ...

డాక్టర్ టి.సుబ్బరామిరెడ్డి

రాజ్యసభసభ్యులు, మాజీ కేంద్రమంత్రివర్యులు

కుమారుడు

## నెల్లూరీయుడికి
# దక్షిణాఫ్రికా జాతీయ సత్కారం



ప్రపంచం నలుమూలలా నెల్లూరీయులు ఎక్కడున్నా తమ ప్రతిభా పాటవాలతో తమ జన్మభూమికే ఎనలేని కీర్తిప్రతిష్టలు తెస్తుంటారు. ఇలాంటి నెల్లూరు ఆణిముత్యమే ఏనుగ శ్రీనివాసులురెడ్డి. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన దక్షిణాఫ్రికా ప్రభుత్వజాతీయ సత్కారాన్ని ఆ దేశం ఆయనకు ఏప్రిల్ 26వ తేదీన ప్రకటించింది. 27వ తేదీన దక్షిణాఫ్రికా అధ్యక్షుడు చేతులమీదుగా ఆయన కుమార్తె లైలా సూరెడ్డి ఆ అవార్డును అందుకున్నారు. జాతివివక్షతకు వ్యతిరేకంగా ఆయన జీవితకాలం పాటూ చేసిన పోరాటాలకుగాను దక్షిణాఫ్రికా ఈ సత్కారం అందజేసింది. ఏనుగ శ్రీనివాసులురెడ్డిది కోవూరు మండలం పల్లాపోలు గ్రామం. తండ్రి వెంకటనరసారెడ్డి. 1924జూలై 1వ తేదీన శ్రీనివాసులురెడ్డి జన్మించారు. స్వగ్రామం నుండి మైకా వ్యాపారం కోసం నరసారెడ్డి గూడూరుకు వలసవెళ్లారు. ఈ కుటుంబానికి స్వాతంత్ర్యోద్యమంలోనూ పాల్గొన్న చరిత్ర వుంది. హైస్కూల్ విద్య తర్వాత కాలేజీ చదువు కోసం నెల్లూరొచ్చిన శ్రీనివాసులురెడ్డి ఇక్కడే జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అక్కడ జాతి వివక్ష ఆయనలో ఓ పోరాటవీరుడిని మేల్కొలిపింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం మొదలుపెట్టారు. ప్రపంచదేశాలన్నీ తిరిగి తన పోరాటానికి మద్దతు కూడగట్టారు. 1949లో ఐక్యరాజ్యసమితి సచివాలయంలో అధికారిగా పనిచేసారు. 1963-68ల మధ్య జాతి వివక్ష వ్యతిరేక పోరాట కమిటీ ప్రధాన కార్యదర్శిగా, 1966-75ల మధ్య ఈ కమిటీకి ఆఫ్రికా విభాగం అధిపతిగా, 1976-84ల మధ్య కమిటీకి కేంద్ర డైరెక్టర్‌గా సేవలందించారు. 1983 జనవరి నుండి 1985 ఫిబ్రవరి వరకు ఐక్యరాజ్యసమితి సహాయ ప్రధానకార్యదర్శిగా పనిచేసారు. జాతివివక్షపై అనేక సభలు నిర్వహించారు. ఐక్యరాజ్యసమితి నుండీ దక్షిణాఫ్రికా విముక్తి కోసం అనేక ప్రచురణలు చేసారు. మహాత్మాగాంధీపై ఎన్నో రచనలు వ్రాసారు. కొంతకాలం దక్షిణాఫ్రికా జాతీయ కాంగ్రెస్‌కు సలహాదారుగా పనిచేసారు. ఆయన సేవలకు గుర్తుగా 1982లో ప్రపంచ శాంతి కమిటీ 'గ్లోరియోక్యూరి' పతకం ప్రకటించింది. 1995లో దర్బన్‌లోని వెస్ట్‌విల్స్ యూనివర్శిటీ గౌరవ డాక్టరేట్‌ను, 2000లో భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారాన్ని ప్రదానం చేసింది. ఇప్పుడు దక్షిణాఫ్రికా ప్రభుత్వం నుండి జాతీయ సత్కారాన్ని అందుకున్నారు. ఒక నెల్లూరీయుడిగా ప్రపంచ స్థాయిలో ఆయన సాగించిన పోరాటాలు, సాధించిన పతకాలు, విజయాలు మనకు గర్వకారణం, స్ఫూర్తిదాయకం. అంతర్జాతీయంగా ఇంతటి కీర్తి సాధించిన శ్రీనివాసులురెడ్డికి 'లాయర్' అభినందనలు.

# మేరిగ మురళీధర్‌కు ఘనస్వాగతం



సమావేశంలో ప్రసంగిస్తున్న మేరిగ మురళీధర్

నూతనంగా వైయస్సార్సీపీ నెల్లూరు జిల్లా కన్వీనర్‌గా నియమితులైన మేరిగ మురళీధర్ ఈ నెల 1న విజయవాడ నుంచి పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో నెల్లూరు చేరుకున్నారు. ఆయనకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పూలమాలలు, మేళతాళాలు, బాణాసంచాలతో ఘనస్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ నుంచి ర్యాలీగా గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకున్న మురళీధర్ దారిలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహానికి, గాంధీ విగ్రహంతో పాటు వై.యస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైయస్సార్‌కు దళితు లంటే ఎనలేని ప్రేమ అని, ఓ దళితుడికి జిల్లా కన్వీనర్ బాధ్యతలు కట్టబెట్టడమే దీనికి నిదర్శనమని అన్నారు. నెల్లూరు ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి తదితరుల ఆశీస్సులతో తను జిల్లా కన్వీనర్‌గా నియమితుడనయ్యానన్నారు. ఇకపై పూర్తిస్థాయిలో జిల్లాలోనే వుంటానని, పార్టీ తనకు అప్పగించిన బాధ్యతను తు.చ తప్పకుండా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ సందర్భంగా వైయస్సార్సీపీ నెల్లూరురూరల్ నియోజకవర్గ సమన్వయకర్త కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, వైకాపా నాయకుడు ఆనం వెంకట రమణారెడ్డి, జిల్లా మహిళా కన్వీనర్ అనిత, సూళ్లూరుపేట సమ న్వయకర్తలు సంజీవయ్య, దబ్బల రాజారెడ్డి, గూడూరు సమన్వయకర్తలు బాల చెన్నయ్య, పాశం సునీల్‌కుమార్, మాజీ డీజీపీ బాల కొండయ్య, సన్నపురెడ్డి సుబ్బారెడ్డి, కర్తం ప్రతాప్‌రెడ్డి, వహీద్‌బాషా, నర్సింహారెడ్డి, పాందు రంగారెడ్డి, తాటి వెంకటేశ్వర్లు, నెమళ్ళపూడి సురేష్‌రెడ్డి, ఇసనాక సునీల్‌రెడ్డి, గౌసపీర్, సుబ్బారత్నమ్మ, సతీష్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి, పర్వీన్ తదితర నాయకులు పాల్గొన్నారు.





నారాయణ BiPC ఉత్తీర్ణతా శాతంలో A&B గ్రేడ్‌లు కలిపి 97.8%
నారాయణ MPC ఉత్తీర్ణతా శాతంలో A&B గ్రేడ్‌లు కలిపి 95.2%
నారాయణ సీనియర్ ఇంటర్ విద్యార్థులలో 90% పైగా సాధించిన విద్యార్థులు 38%

NARAYANA 1

నీట్/మెయిన్స్/అడ్వాన్స్‌డ్ పోటీ పరీక్షల్లో మార్పులు ఎన్నైనా..
నారాయణ ప్రణాళికతోనే విజయం సాధ్యం. నేటి సీనియర్ ఇంటర్ ఫలితాలే దానికి సాక్ష్యం

సీనియర్ ఇంటర్‌లో నారాయణ సాధించిన గ్రూపు మార్కుల విశ్వరూపానికి ఇదే నిదర్శనం

| Group Cum% | రాష్ట్రంలో నారాయణ విద్యార్థుల సంఖ్య | రాష్ట్రంలో నారాయణ విద్యార్థుల శాతం |
|---|---|---|
| 100.00 | 173 | 25.71 |
| 99.83 | 396 | 27.60 |
| 99.67 | 635 | 26.87 |
| 99.50 | 918 | 27.25 |
| 99.33 | 1231 | 28.12 |
| 99.17 | 1555 | 28.55 |
| 99.00 | 1909 | 28.84 |
| 98.83 | 2276 | 29.12 |
| 98.67 | 2632 | 29.09 |
| 98.50 | 3009 | 29.13 |
| 98.33 | 3392 | 29.42 |
| 98.17 | 3777 | 29.48 |
| 98.00 | 4189 | 29.64 |
| 97.83 | 4585 | 29.72 |
| 97.67 | 4969 | 29.60 |
| 97.50 | 5377 | 29.63 |
| 97.33 | 5736 | 29.48 |
| 97.17 | 6131 | 29.58 |
| 97.00 | 6503 | 29.48 |
| 96.83 | 6875 | 29.38 |
| 96.67 | 7301 | 29.50 |
| 96.50 | 7684 | 29.50 |
| 96.33 | 8090 | 29.47 |
| 96.17 | 8457 | 29.36 |
| 96.00 | 8846 | 29.36 |
| 95.83 | 9220 | 29.32 |
| 95.67 | 9581 | 29.24 |
| 95.50 | 9982 | 29.27 |
| 95.33 | 10322 | 29.14 |
| 95.17 | 10678 | 29.07 |
| 95.00 | 11024 | 28.95 |

990/1000 MPC | 990/1000 MPC | 990/1000 MPC | 987/1000 BiPC

MPC TOP MARKS
988/1000 | 988/1000 | 988/1000 | 988/1000 | 987/1000 | 987/1000 | 987/1000
987/1000 | 987/1000 | 987/1000 | 987/1000 | 987/1000 | 987/1000

BiPC TOP MARKS
986/1000 | 985/1000 | 984/1000 | 984/1000
983/1000 | 983/1000 | 983/1000 | 983/1000 | 983/1000

MECTOP MARKS
973/1000 | 972/1000 | 972/1000

సీనియర్ ఇంటర్‌లో నారాయణ విద్యార్థుల మార్కుల విశ్లేషణ

| TOTAL | STATE | NARAYANA | PER |
|---|---|---|---|
| 990 పైగా | 18 | 3 | 16.66 |
| 980 పైగా | 1542 | 470 | 30.47 |
| 970 పైగా | 7325 | 2184 | 29.81 |
| 960 పైగా | 15418 | 4614 | 29.92 |
| 950 పైగా | 24307 | 7252 | 29.83 |
| 940 పైగా | 33458 | 9853 | 29.44 |
| 930 పైగా | 42590 | 12355 | 29.00 |
| 920 పైగా | 51511 | 14662 | 28.46 |
| 910 పైగా | 60079 | 16768 | 27.90 |

| సబ్జెక్ట్ | మార్కు శాతం | రాష్ట్రంలో నారాయణ విద్యార్థుల శాతం |
|---|---|---|
| మ్యాథ్స్ (ఎ) | 75/75 | 28.94 |
| మ్యాథ్స్ (బి) | 75/75 | 31.24 |
| ఫిజిక్స్ | 60/60 | 21.55 |
| కెమిస్ట్రీ | 60/60 | 31.12 |

బోర్డ్‌వారు కేటాయించిన కోడ్స్‌వారీగా కొన్ని నారాయణ కాలేజీల ఉత్తీర్ణతా శాతాలు

| Sl. | CODE | PERC |
|---|---|---|
| 1 | 1088 | 100.00 |
| 2 | 2126 | 100.00 |
| 3 | 2170 | 100.00 |
| 4 | 26393 | 100.00 |
| 5 | 8065 | 100.00 |
| 6 | 8074 | 100.00 |
| 7 | 11078 | 100.00 |
| 8 | 15198 | 100.00 |
| 9 | 15222 | 100.00 |
| 10 | 28177 | 100.00 |
| 11 | 8070 | 99.81 |
| 12 | 28069 | 99.78 |
| 13 | 27169 | 99.55 |
| 14 | 8068 | 99.46 |
| 15 | 3011 | 99.42 |
| 16 | 28119 | 99.38 |
| 17 | 10061 | 99.35 |
| 18 | 27086 | 99.22 |
| 19 | 10050 | 99.14 |
| 20 | 27074 | 99.12 |
| 21 | 2002 | 99.10 |
| 22 | 28176 | 98.92 |
| 23 | 8014 | 98.85 |
| 24 | 8077 | 98.80 |
| 25 | 15290 | 98.80 |
| 26 | 10468 | 98.65 |
| 27 | 10642 | 98.63 |
| 28 | 10021 | 98.54 |
| 29 | 28120 | 98.50 |
| 30 | 5004 | 98.49 |
| 31 | 15081 | 98.46 |
| 32 | 27010 | 98.43 |
| 33 | 16271 | 98.39 |
| 34 | 15543 | 98.33 |
| 35 | 28157 | 98.32 |
| 36 | 15330 | 98.31 |
| 37 | 15192 | 98.26 |
| 38 | 22111 | 98.24 |
| 39 | 10181 | 98.18 |
| 40 | 27642 | 98.07 |

drusya

నారాయణ విద్యాసంస్థలు

visit us @ www.narayanagroup.com


Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.